

Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

Longest Living Newspaper in Telugu Journalism

జమీందారు

సంపుటి: 82 • సంచిక: 6 • 11-2-2011 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-



చరిత్ర హీనుడైనాడు!



- విలీనం విలువ 300 కోట్లు?
- సినిమాను అమ్మినంత సులభం.
- అభిమానులు ఆక్రోశిస్తున్నారు.
- నట్టేట ముంచాడని నిందిస్తున్నారు.
- మంత్రి పదవులు ఇవ్వరు, తీసుకోరు.
- నమ్మినవారంతా చెడారు.
- కాపు కులంలో తీవ్ర నిరసన.
- అగ్ర కులాధిపత్యానికి అడ్డే లేదు.

ప్రజారాజ్యం పార్టీ కాంగ్రెస్ సాగరంలో నిమజ్జనమై పోయింది. వినాయకుడి బొమ్మను హుస్సేన్‌సాగర్‌లో ముంచినంత సులభంగా, తన పార్టీని కాంగ్రెస్‌లో కలిపేశాడు చిరంజీవి. దీనికి ప్రత్యేక కారణం ఏదీ లేదు. సోనియాగాంధీ అడిగింది కాబట్టి, విలీనం చేశానని ఒక్క మాటలో తేల్చేశాడు చిరంజీవి. చాలా తేలికగా తీసుకొన్నాడాయన ఈ పరిణామాన్ని. తాను నటించే సినిమాలను నైజాం, సీడెడ్ కొనుగోలుదారులకు అమ్మినంత సులభంగా ఒక్క రోజులో అంత పెద్ద పార్టీని అమ్మిపారేశారాయన.


వూహించిన పరిణామమే అయినా, చిరంజీవి అభిమానులలో ఆయన్ను నమ్మి రాజకీయాలకు వచ్చిన వారిలో, ఆయన ద్వారా రాజకీయాలలో కొత్త మార్పులు వస్తాయని ఆశించిన వారిలో తీవ్ర మనఃక్లేశం చెలరేగుతున్నది. అభిమానులైతే ఆవేదనతో ఆక్రోశిస్తున్నారు. నెత్తీనోరు బాదుకొంటున్నారు. దాదాపు ఏడాది నుంచే ఈ ప్రతిపాదన చర్చలో వుంది. రోశయ్య ముఖ్యమంత్రి అయిన కొత్తలో, తిరుమల పద్మావతి అతిథి గృహంలో మొదటిసారిగా ఈ ప్రతిపాదన వచ్చింది. అప్పటి టిటిడి ఛైర్మన్ ఆదికేశవుల నాయుడు చిరంజీవిని రోశయ్య వద్దకు తీసుకవెళ్లి మరీ ఈ చర్చకు శ్రీకారం చుట్టాడు. ఆ వెంటనే చిరంజీవి అభిమతాన్ని రోశయ్య అధిష్టానం దృష్టికి తీసుకవెళ్లాడు. అయితే అప్పట్లో జగన్ సమస్య అంత తీవ్రంగా లేదు కాబట్టి, సోనియాగాంధీ దానిపై ఆసక్తి చూపలేదు. వినీ విననట్లు వదిలేశారు. కానీ చిరంజీవి మాత్రం అవకాశం కోసం ఎదురు చూస్తూనే వున్నాడు. ఆయనకు మొదట నుంచీ రాజకీయాలంటే ఇష్టం లేదు. ఎవరో పట్టి బలవంతంగా తెస్తే వచ్చినవాడే తప్ప, స్వంత ఉత్సాహంతో రంగంలోకి దూకినవాడు కాడు. ఎన్నికలలో తాను గెలిచి పోతానని, నేరుగా ముఖ్యమంత్రి పీఠంపై కూర్చుంటానని, దానివల్ల వైఎస్.రాజశేఖర్‌రెడ్డి వలె తనకూ వేల కోట్ల రూపాయలు ఆర్జించే అవకాశం వస్తుందని ఆశ పడ్డాడు. కానీ చేతకానితనం వల్ల ఆ ఆశ నిరాశ అయ్యింది. అప్పటి నుంచి ఆయన రోజులు లెక్కపెట్టుకొంటూ రాజకీయాలలో అయిష్టంగా కాలం గడిపాడు. మళ్లీ సినిమాలపై దృష్టి పెట్టాడు. విపరీతంగా పెరిగిపోయిన శరీరం బరువును అమెరికాకు వెళ్లి తగ్గించుకొని వచ్చాడు. సన్నగా రివట వలె తయారయ్యాడు. మరొకసారి సినీ హీరోగా తెరపై కన్పించడానికి కథ, స్క్రీన్‌ప్లే సిద్ధం చేసుకొన్నాడు. ఇక రంగు పూసుకోవడం ఒక్కటే మిగిలి వుంది.

ఈ మధ్యలో రాజకీయాలు కూడా మారిపోయాయి. వైఎస్.జగన్, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి పెద్ద గండంగా ఎదిగిపోయాడు. ఆయన ఎక్కడికి వెళ్లినా జన నీరాజనం లభిస్తున్నది. కాంగ్రెస్ నుంచి చిన్నా పెద్ద నాయకులంతా వరసబెట్టి వలస కడుతున్నారు. కొన్ని జిల్లాలలో కాంగ్రెస్ కొంప ఖాళీ అయిపోయింది. అధిష్టానం ఎంత కన్నెర చేసినా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లెక్క చేయడం లేదు. ముప్పై మంది వరకు జగన్ గూటిలో చేరిపోయే ప్రమాదం కన్పించింది. అదే జరిగితే కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వం కుప్ప కూలి పోతుంది. ఎన్నికలు వచ్చేస్తాయి. కాంగ్రెస్ పార్టీ కనీసం మరొక దశాబ్దం పాటు రాష్ట్రంలో అధికారం అనే మాటను కల కూడా కనలేదు. 42 సీట్లున్న రాష్ట్రంలో పార్టీ దివాళా తీస్తే కేంద్రంలో తమ అధికారం ఆయువు కూడా మూడినట్లే లెక్క. పరిస్థితి కళ్ల ముందు ఇంత భయానకంగా కన్పించడంతో సోనియాగాంధీ మనసు మార్చుకొన్నది. గజేంద్ర మోక్షంలో మొసలికి శ్రీ మహావిష్ణువు జ్ఞాపకానికి వచ్చినట్లు, సోనియాగాంధీకి చిరంజీవి స్మరణకు వచ్చాడు. వాస్తవ పరిస్థితి అయితే, ఆమె వెళ్లి పాహిమాం అని చిరంజీవి కాళ్ల దగ్గర ప్రణమిల్లాలి. కానీ రాజకీయాలలో మొదట నుంచీ తాను చేత కాని వాడినని పదేపదే నిరూపించుకొంటూ వస్తున్న చిరంజీవి ఇక్కడ కూడా అదే అమాయకత్వం చూపాడు. తన కాళ్లమీద సోనియాగాంధీ వాలేట్లు చేసుకోవాల్సినవాడు కాస్తా, తానే ఢిల్లీ వెళ్లి ఆమె పాద పూజ చేసి వచ్చాడు.

అక్కడ వారిద్దరి మధ్య ఏమి జరిగిందో మనకైతే తెలియదు. కానీ తిరిగి

కొరవ 14వ పేజీలో

కార్టూన్ స్కేప్



'రచ్చబండ'లో బ్యానర్లు చిరిగి... చివరకిది మిగిలింది సార్!

హైకోర్టుతో ఆటలా?

రాజకీయాలలో సర్వశక్తివంతం అనుకొన్న సోనియాగాంధీని ధిక్కరించి, రోజుకొక ఆట ఆడుతున్న వైఎస్.జగన్ – హైకోర్టు విషయంలోనూ అదే క్రీడా వినోదం అనుభవించాలని ప్రయత్నిస్తున్నాడు. తన అవినీతి ఆర్జనపైన, సాక్షి పెట్టుబడుల పైన మంత్రి శంకరరావు వ్రాసిన లేఖను, సుమోటో కేసుగా మలచిన హైకోర్టు మీద జగన్‌లో కోపం కట్టలు తెచ్చుకొంటున్నది. హైకోర్టు తన మీద కక్ష కట్టి, లేని కేసును సృష్టించిందని జగన్ అనుమానం. ఆ కక్ష తీర్చుకోవడానికి హైకోర్టుతోనే ఆటలు మొదలు పెట్టాడాయన. చంద్రబాబునాయుడు, ఈనాడు రామోజీరావు, రిలయన్స్ కంపెనీల మీద తన వర్గం ఎమ్మెల్యేలతో లేఖాస్త్రాలు సంధిస్తున్నాడు. తన మీద ఒక ఎమ్మెల్యే వ్రాసిన జాబును కేసుగా మార్చిన హైకోర్టు ఇప్పుడు తన ఎమ్మెల్యేలు వ్రాసే జాబులను కూడా కేసులుగా మార్చాలన్నది జగన్ ఆంతర్యం. న్యాయస్థానాల పట్ల ఇంత చులకన భావంతో, ఎగతాళి పట్టించే ధోరణిలో, కవ్వించే పోకడతో వ్యవహారం నడిపే సాహసం చరిత్రలో ఇప్పటివరకు ఎవరూ చేయలేదు. న్యాయస్థానాలను రాజకీయ కక్షలకు బలిపెట్టాలన్న దురాలోచన సహించరానిది. క్షమించరానిది. న్యాయస్థానాలు సర్వ సత్తాక స్వయం ప్రతిపత్తి కల్గిన సంస్థలు. వాటి ద్వారా రాజకీయ కక్షలు తీర్చుకోవాలని చేసే ప్రయత్నాలు దుర్మార్గమైనవి.

[మన్మోహన్ సింగ్‌దే బాధ్యత!]

న్యాయం చేయడమే కాదు, న్యాయం చేసినట్లు కూడా కన్పడాలన్నది న్యాయ వ్యవస్థ పట్ల విశ్వాసానికి తప్పనిసరని చెప్తారు. ప్రభుత్వాధినేతల ప్రవర్తన విషయంలోనూ ఈ సూత్రం వర్తిస్తుంది. తాము నీతిగా వుండడమే కాదు, తమ పరిపాలనలో నీతి చలామణి అయ్యేట్లు చూసుకోవడం కూడా వారి బాధ్యత. ఈ విషయంలో మన ప్రధాని మన్మోహన్‌సింగ్ దారుణంగా విఫలమౌతున్నాడు. వ్యక్తిగా ఆయన సౌజన్యశీలి. సుగుణాల రాశి. నీతికి నిజాయితీకి ప్రతిరూపం. కానీ దురదృష్ట వశాత్తు ఆయన పరిపాలన కుంభకోణాల మయంగా నడుస్తున్నది. ఆయన ప్రభుత్వంలో అవినీతి భూతం వెయ్యి జడల రాక్షసి వలె వికటాట్టహాసం చేస్తున్నది. ఇనుపగజ్జెలతో కరాళ నృత్యం చేస్తున్నది.

ఎన్ని కుంభకోణాలు, ఎన్నెన్ని గోల్మాల్లు, ఎన్నిరకాల బందిపోటు నేరాలు, ఎంతెంత ప్రజాధనం నిట్టనిలువు దోపిడీ... ఈ ఏడేళ్ల మన్మోహన్ సింగ్ పాలనలో అరవై ఏళ్ల స్వాతంత్ర్య భారత చరిత్రలో జరిగిన అవినీతి మొత్తం ఒక ఎత్తు, ఈ ఏడేళ్లలో ఆయన ధర్మాన జరుగుతున్న దోపిడీ ఒక్కటే ఒక ఎత్తు. లక్షా డెబ్భై వేల కోట్ల రూపాయల స్పెక్ట్రం కుంభకోణం కల్గించిన దిగ్భ్రాంతి నుంచి దేశం ఇంకా కోలుకోక ముందే, దాని తలదన్నే ఎస్ బ్యాండ్ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. దీని విలువ రెండు లక్షల కోట్ల రూపాయల పైమాటే అంటున్నారు. భారత రోదసీ పరిశోధన సంస్థ (ఇస్రో) ఆధీనంలో వుండే అత్యంత విలువైన సహజ సంపద అయిన ఎస్ బ్యాండ్ స్పెక్ట్రం తరంగాలను కుటిలోపాయంతో ఒక ప్రైవేటు కంపెనీ ఉచితంగా కొట్టేసింది. ఎంతో తెలివిగా చేసిన మోసం ఇది. స్పెక్ట్రం అంటే ఆకాశంలో విహరించే విద్యుత్ అయస్కాంత తరంగాలు. నిశ్చలమైన కోనేటి నీటిలో ఒక రాయి విసిరితే గుండ్రంగా విస్తరించే నీటి అలల వలె రోదసి నుంచి ఈ తరంగాలు ప్రసరిస్తూ వుంటాయి. అవి సౌర వ్యవస్థ నుంచి పుట్టే సహజ సిద్ధ తరంగాలు. వాటి పరిణామం పరిమితం. ఉన్నవాటిని వాడుకోవల్సిందే తప్ప కొత్తవి పుట్టించలేము. ఆధునిక సమాచార ఉపకరణాలైన మొబైల్ ఫోన్, రేడియో, వైర్‌లెస్, ఇంటర్నెట్ వంటి వాటి సంకేతాలను మోసుకొని వెళ్లగల సామర్థ్యం ఈ తరంగాలకు వుంటుంది. అందువల్ల వాటి విలువ అమూల్యం. మొబైల్ ఫోన్, ఇంటర్నెట్‌లు ప్రజలకు నిత్యావసర వస్తువులుగా మారిన తర్వాత వాటి వాడకం బాగా పెరిగింది. అందువల్ల అన్ని దేశాల ప్రభుత్వాలు వాటికి విలువ నిర్ణయించి, అవసరమైన వారికి కేటాయిస్తున్నాయి. కొన్ని లక్షల కోట్ల రూపాయల ఆదాయం ప్రభుత్వాలకు చేకూర్చి పెడుతున్నాయి. ఈ విద్యుతయస్కాంత తరంగాలన్నిటిలోకి అత్యంత నాణ్యమైనవి, శక్తివంతమైనవి ఎస్ బ్యాండ్ తరంగాలు. ఉపగ్రహాల ద్వారా మాత్రమే వాటిని వినియోగించుకోగలుగుతాము. అందువల్ల అన్ని దేశాల ప్రభుత్వాలూ ఈ ఎస్ బ్యాండ్ తరంగాలను రోదసీ పరిశోధన, రక్షణ, శాస్త్ర సాంకేతిక రంగాలకు మాత్రమే వినియోగిస్తున్నాయి. కొన్ని ప్రత్యేక వాణిజ్య కార్యక్రమాలకు మాత్రం కళ్లు చెదిరే ధరలలో అమ్ముతున్నాయి. కానీ బెంగుళూరుకు చెందిన ఒక ప్రైవేటు కంపెనీ చాలా తెలివిగా కొట్టేసింది దీన్ని. ఇస్రో ఉపగ్రహాలను కొనుగోలు చేసే నెపంతో ఒక ఒప్పందం చేసుకొన్నది. రెండు ఉపగ్రహాలు కొనుగోలు చేసి, వాటిలో వుండే ట్రాన్స్‌పాండర్ల ద్వారా దేశంలో బ్రాడ్ బ్యాండ్ ఇంటర్నెట్, మొబైల్ ఫోన్ వంటి సౌకర్యాలను విస్తరిస్తామన్నది ఈ కంపెనీ చెప్పిన వ్యాపారం. ఇస్రో అధికారులు అమాయకంగా ఆ కంపెనీతో ఒప్పందం చేసుకొన్నారు. అయితే తాము ఉపగ్రహాలకు మాత్రం సొమ్ము తీసుకొని, వాటితో అనుసంధానంగా వుండే ఎస్ బ్యాండ్ తరంగాలను ఉచితంగా ఇచ్చేస్తున్నామన్న నిజం వారి బుర్రలకు తట్టలేదు. ఈ ఒప్పందం అమలు చేస్తే, రానున్న ఇరవైఏళ్ల పాటు ఎస్ బ్యాండ్ తరంగాలలో సగభాగం ఆ కంపెనీ ఆస్తిగా మారుతాయి. దాని విలువ రెండు లక్షల కోట్ల రూపాయల పైమాటే.

జమీన్‌రైతు

విషాదం ఏమిటంటే, రోదసీ పరిశోధన విభాగం ప్రధానమంత్రి ఆధీనంలో వుంది. ఈ ఒప్పందం ఆయనకు తెలుసు. పైగా దానికి కేంద్ర మంత్రివర్గ ఆమోద ముద్ర కూడా వేయించాడు. సంతకం పెట్టేటప్పుడు దాని వల్ల వచ్చే నష్టం ఆయనకు తెలియకపోవచ్చు. కానీ తెలియనితనం నేరానికి పరిహారం కాదన్నది న్యాయసూత్రం. తెలిసి చేసినా తెలియక చేసినా తన తప్పిదం వల్ల దేశానికి తీరని నష్టం తెచ్చి పెట్టిన తర్వాత కూడా ఆయన ప్రధాని పదవిలో కొనసాగడం ధర్మం కాదు. ఒక రైలు ప్రమాదానికి బాధ్యత వహించి మంత్రి పదవికి రాజీనామా చేసిన లాల్‌బహదూర్ శాస్త్రిని ఈ క్షణంలో జ్ఞప్తికి తెచ్చుకొంటే మన్మోహన్‌సింగ్ ఇప్పుడు నిర్వర్తించవలసిన ధర్మం ఏమిటో చెప్పకనే అర్థమౌతుంది.

జనవాణి

టౌన్‌హాల్‌లో గోలగోల!

నెల్లూరు టౌన్‌హాల్‌లో జరిగే కార్యక్రమాల్లో సంగీత విభావరి ఒక భాగమయ్యింది. కాని టౌన్‌హాల్‌లో సౌండ్ సిస్టమ్ సరి లేదు. పద్ధతి పాడు లేకుండా అమర్చిన సౌండ్ బాక్సులు సీలింగ్ లేకపోవడం వల్ల కార్యక్రమం జరిగినంత సేపు గోలగోల. మధ్య ఎవరు ఏం మాట్లాడుతున్నారో అర్థమే కావడం లేదు. టౌన్‌హాల్‌లో సౌండ్ సిస్టమ్‌ను మెరుగుపర్చమని మనవి.

ములుమూడి ప్రభాకరరావు, నెల్లూరు

వితరణ శీలి వేణుగోపాలరెడ్డి!

అవి 1970–75ల మధ్య కొత్తగా ఎన్నికై సమితి రాజులు హుషారెక్కిన కరుకు రోజులు. బుచ్చి సమితిలో దొడ్లవారి పెత్తనం పోయి మేనకూరి ప్రభలు వెల్గిన దినాలు. ముఖ్యంగా అల్లూరు ప్రాంతంలోని గ్రామాల్లో స్తబ్ధత తొలగి కదలిక మొదలైంది. ఏళ్ల తరబడి గ్రామ రాజకీయాల సుడిగుండాల్లో చిక్కుక పోయిన అల్లూరు రక్షిత నీటిపథకం, నార్తుమోపూరు, ఇందుపూరు వగైరా గ్రామాల పాఠశాలల స్వంత భవన నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్ లభించింది. సమితి రాజు బాలకృష్ణారెడ్డి చొరవతో అప్పటిదాకా బాడుగింట్లో కునికిపాట్లు పడుతున్న నార్తుమోపూరు ప్రాథమిక పాఠశాలకు స్వంతింటిని, స్థలాన్ని ఉదారంగా దానమిచ్చి నెల్లూరుకు మకాం మార్చిన గొప్ప వితరణ శీలి కాకాణి వేణుగోపాలరెడ్డి. నార్తుమోపూరులో రాజవీధులు తప్ప ఆ గ్రామానికి చెందిన బిసి, ఎస్‌సి వాడల జనానికి సరైన రోడ్డు వసతి లేని దుస్థితిలో భూమి సేకరణ ద్వారా విశాలమైన రెండో వీధి ఏర్పాటుచేసి, సమీప గ్రామమైన భట్రకాగొల్లుకు నేరుగా రోడ్డు సౌకర్యం ఒనగూర్చిన ఘనత అబ్బయ్యగా పిలిచే వేణుగోపాలరెడ్డిదే. తరాలుగా భూస్వాముల పెత్తనం క్రింద నలిగిన నార్తుమోపూరులో గ్రామాభ్యుదయ కార్యక్రమాలకు తొలి అడుగువేసిన ఓ మంచి మనిషి కాకాణి వేణురెడ్డి.

ఎం.రామమూర్తి, విశాఖపట్నం

రైల్వే సదుపాయాలు కల్పించండి!

నెల్లూరు జిల్లా పారిశ్రామికంగా పరుగులు తీస్తుంది. రవాణా సౌకర్యంలో ముఖ్యమైన రైల్వేస్టేషన్‌ను మోడల్ స్టేషన్‌గా అభివృద్ధి చేశారు. కాని రైల్వేపరంగా కొన్ని వెనకబాటు విషయాలున్నాయి. చెన్నై నుంచి హజరత్ నిజాముద్దీన్‌కు వెళ్లే గరీబ్‌రథ్ నెల్లూరులో ఆగడం లేదు. ఉదయం పూట నడిచే కేరళ ఎక్స్‌ప్రెస్‌కు విజయవాడలో దిగే ప్రయాణీకులకు రెండవ తరగతి టిక్కెట్ ఇచ్చే సౌకర్యాలు ప్రజాప్రతినిధులు కల్పించమనవి.

సిహెచ్.సురేష్, నెల్లూరు

కొరవ 14వ పేజీలో

70 ఏళ్ల క్రితం ఈవారం

14-2-1941
పేజీలు : 16 వెల: అణా

అందరికీ ఒకటే క్లాసు

తిరుచునాపల్లి జైల్లో 186 మంది ఏ, బి తరగతి రాజకీయ ఖైదీలున్నారు. అందులో 160 మంది వి.వి.గిరి, బయ్యా సూర్యనారాయణమూర్తి, వెన్నెలకంటి రాఘవయ్య వగైరాలంతా కలసి ఈ క్రింది విధంగా ప్రభుత్వానికి పిటిషన్ దాఖలు చేశారు. "రాజకీయ ఖైదీలందరికి 'బి' క్లాసు ఇవ్వండి లేదా వాళ్లందరిపైనా ఖర్చయ్యే డబ్బును అందరికీ సమానంగా పంపకం చేయండి".

వెన్నెలకంటి రాఘవయ్య (నెల్లూరు ప్లీడరు) గారు మాత్రం ప్రత్యేక పిటిషన్‌లో ప్రభుత్వం పైన సూచింపబడిన దానికి అంగీకరించకపోతే తన్ను 'సి' క్లాసులోకి పంపించమని వ్రాసియున్నారని తెలుస్తున్నది. ప్రస్తుతం రాఘవయ్య గారు 'ఏ' క్లాసులోనున్నారు.

గూడూరు సత్యాగ్రహుల రాక

గూడూరు డివిజన్ నుంచి ఢిల్లీకి బయలుదేరిన సత్యాగ్రహులు ఈ దినం 8 గంటలకు నెల్లూరు చేరారు. ట్రంకురోడ్డులోని కాంగ్రెస్ కార్యాలయం ఎదుట గొప్ప స్వాగతము యివ్వబడిన పిదప కాంగ్రెస్ కమిటీవారు అల్పాహార విందొసగిరి. సంతపేట, చిన్నబజారు, పెద్దబజారుల గుండా ఊరేగింపుతో మూలపేటకు వెళ్లారు. తిక్కవరపు రామిరెడ్డి గారి యింట మధ్యాహ్నం భోజనం, సాయంత్రం లాఠీచౌక్‌లో సభ. రాత్రి మునిసిపల్ కాంగ్రెస్ పార్టీ వారి విందు. రేపు 'జమీన్‌రైతు' వారి విందు ఇంకా ఇంకా.

మునిలాల్‌కు విందు

ఎన్.మాధవరావు గారు నెల్లూరుకు మునిలాల్ గారు చేసిన సేవకు పారితోషికంగా కాబోలు మొన్న విందుచేసి ధన్యులైనారట. హిందూ మహమ్మదీయుల గలాటా దీపం వారెలిగించిందేనే మహానుభావా?

50 ఏళ్ల క్రితం ఈవారం

10-2-1961
పేజీలు: 12 వెల: 0-20 న.పై

అంజలి

'జమీన్‌రైతు' సంస్థాపకులు నెల్లూరు వెంకట్రామానాయుడు గారు దివికేగి ఫిబ్రవరి 7వ తేదీకి రెండు సంవత్సరాలు నిండినవి.

'జమీన్‌రైతు' శాశ్వత నిర్వహణ నాయుడు గారి సంకల్పం. గ్రామీణ రైతాంగ జనసేవ వారి జీవిత లక్ష్యం. వారి జీవితలక్ష్యానికి 'జమీన్‌రైతు'ను పునరంకితం జేస్తూ, ఆ సంకల్ప సిద్ధుని అమృత హృదయుని పవిత్ర స్మృతికి అంజలి ఘటిస్తున్నాము.

నెల్లూరు ముచ్చట్లు

పెన్నలో కాలేజి విద్యార్థి దుర్మరణం

వి.ఆర్ కాలేజిలో ప్రీ యూనివర్శిటీ చదువుతున్న ఎస్.కమలనాధసింగ్ అనే 19 సంవత్సరాల విద్యార్థి 5వ తేది ప్రాక్టికల్ క్లాసుకు హాజరై, కోవూరుకు తిరిగిపోతూ ఆనకట్టకు ఎగువన స్నానం చేయుటకు దిగి ఊబిలో చిక్కుకొని దుర్మరణం పాలయ్యాడు. అతని శవం మరో రోజు మధ్యాహ్నం దొరికింది. ఈ యువకుడు కోవూరు హెచ్.శంకరసింగ్ కుమారుడు.

కమలనాధ్‌సింగ్ మరణానికి సానుభూతి సూచకంగా 6వ తేది కాలేజి మూసివేయబడింది.

గూడూరు క్రిస్టియన్ల అరెస్ట్ – విడుదల!

5వ తేది ఆదివారం చర్చిలో ప్రార్థనలు జరిపి తిరిగి వస్తుండిన 20 మంది గూడూరు క్రిస్టియన్లు పోలీస్‌చే కస్టడీలోకి తీసుకోబడి, తర్వాత విడుదల చేయబడినారు. వీరు పోలీసు నిర్బంధంలో గూడా ప్రార్థనలు చేస్తూ పురవీధులలో ఉత్సవంగా పోయారట. స్థానిక క్రిస్టియన్లలోని వివాదాల కారణంగా గూడూరు చర్చి మూతబడి వున్న విషయం పాఠకులకు తెలిసినదే.

నెల్లూరు ముచ్చట్లు

వైఎస్ రుణం తీరుతుందా?

నెల్లూరు కరంటాఫీసు సెంటర్‌లో రాష్ట్రంలో ఎక్కడాలేనట్లుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 12 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు ఆనం బ్రదర్స్. ఈ విగ్రహ ఏర్పాటుతో తమకు రుణం తీరుతుందని ఆనం బ్రదర్స్ భావిస్తున్నట్లున్నారు. కరంటా ఫీసు సెంటర్‌ను ఇక వైఎస్ఆర్ సెంటర్ అని పేరు మారుస్తున్నారు. ఇక్కడ నిర్మిస్తున్న ట్రాఫిక్ ఐలాండ్ వద్ద హైమాస్ట్ లైట్లతోపాటు ఈ సెంటర్‌లో సెంట్రల్ లైటింగ్ వంటి ఆకర్షణలు చేస్తున్నారు బ్రదర్స్.

చిరంజీవి రాకతో బలం

మెగాస్టార్ చిరంజీవి రాకతో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమయ్యిందని రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానంద రెడ్డి వ్యాఖ్యానించారు. 7వ తేది ఎసి సెంటర్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి గతంలో చిరంజీవిని తిట్టిన నోటితోనే పొగిడారు. కాంగ్రెస్‌కు చిరంజీవి అందమైన ఆస్తి. ఆయన మా పార్టీలో చేరడంతో బెంబేలెత్తుతున్న విపక్షాలు అవాకులు చెవాకులు పేలుతున్నాయి. చిరంజీవిని ప్రశ్నించే హక్కు ఎవరికీ లేదని వివేకానందరెడ్డి తేల్చి చెప్పారు.

వాకాడుకు సిఎం?

వాకాడులో మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి 20వ తేది ఏర్పాటుచేయ తలపెట్టిన స్వర్గీయ నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి, తమిళనాడు ఉప ముఖ్యమంత్రి స్టాలిన్‌ను ఆహ్వానించినట్లు తెలిసింది. అయితే వీరి రాక అధికారికంగా ఇంకా ఖరారు కాలేదు.

ఇక హ్యాపీ...

ప్రజారాజ్యం పార్టీ కాంగ్రెస్‌లో విలీనమవడం పట్ల సిటీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి సంతోషాన్ని వ్యక్తం చేశారు. 7వ తేది నగరంలో 31, 42, 43 డివిజన్లలో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డితో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నేను, వివేకానందరెడ్డి కలసి అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొంటుంటే కొందరు అదేపనిగా విమర్శలు చేసేవారు. ప్రజారాజ్యం కాంగ్రెస్‌లో విలీనం కావడం వల్ల ఇక విమర్శలకు తావులేదు. ప్రజా సమస్యల పరిష్కారానికి వివేకాతో కలసి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని శ్రీధర్‌కృష్ణారెడ్డి సంతోషంగా చెప్పారు.

అద్దె చెల్లించని దుకాణాలు సీజ్

నగరంలో కార్పొరేషన్ యాజమాన్యాన గల షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో వుంటూ అద్దె చెల్లించని దుకాణాలను అధికారులు సీజ్ చేశారు. సుబేదార్‌పేట, బివిఎస్ హైస్కూలు కాంప్లెక్స్, దర్గామిట్టలో గల పలు దుకాణాదారులు దీర్ఘకాలంగా అద్దె చెల్లించకుండా వుండడంతో మునిసిపల్ కమిషనర్ ఆంజనేయులు ఆదేశాల మేరకు సిబ్బంది ఈ షాపులను సీజ్ చేశారు.

ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు!

నెల్లూరు అర్బన్ ఆర్యవైశ్య సంఘానికి హైడ్రామా నడుమ ఏకగ్రీవ ఎన్నిక జరిగింది. అధ్యక్షునిగా కోట గురుబ్రహ్మం, కార్యదర్శిగా తులసి చంద్రశేఖర్‌లను ఎన్నుకొన్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శుల చేత వైశ్య ప్రముఖుడు దాసా లక్ష్మీ నారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. దర్గామిట్టలోని వేమాల శెట్టి బావి సత్రం వద్ద కన్యకా పరమేశ్వరి దేవస్థానం నిర్మాణం లక్ష్యంగా పని చేస్తానని నూతన అధ్యక్షుడు కోట గురు బ్రహ్మం ప్రకటించారు.

అక్రమ నిల్వలపై విజిలెన్స్ దాడులు

అధిక ధరలకు అమ్ముకొనేందుకు నిత్యావసర వస్తువులను అక్రమంగా నిల్వ వుంచిన పలువురు వ్యాపారులు, గోడౌన్లపై విజిలెన్సు అధికారులు దాడులు చేశారు. పొదలకూరు, నెల్లూరు ఎకెనగర్‌లో గల గోడౌన్లపై దాడిచేసిన అధికారులకు పెద్ద ఎత్తున నిల్వచేసిన కందులు, పెసలు, మినుములు, నువ్వులు తదితర నిత్యావసర వస్తువులు పట్టుపడ్డాయి. వీటి విలువ రెండు కోట్ల రూపాయల పైబడేనని అధికారులు గుర్తించారు.

రాజీవ్ విద్యామిషన్‌కు కొత్త పిఓ!

నెల్లూరు రాజీవ్ విద్యామిషన్ పిఓగా జిలానీబాష నియమితులయ్యారు. ఆయన 8వ తేది బాధ్యతలు స్వీకరించారు. జిలానీబాష గతంలో కావలి డిప్యూటీ డిఇఓగా పనిచేశారు. మంచి అధికారిగా పేరున్న ఈయన రాజీవ్ విద్యామిషన్‌ను సక్రమంగా నడపాల్సి వుంది.

అనిల్ అంబానీ రాక!

రిలయన్స్ పవర్ ప్రాజెక్ట్ అధినేత అనిల్ అంబానీ 5వ తేది కృష్ణపట్నం వచ్చారు. ఇక్కడ నిర్మిస్తున్న థర్మల్ విద్యుత్ కేంద్రం పనులను పరిశీలించేందుకై ప్రత్యేక హెలికాప్టర్‌లో వచ్చారు. తిరుపతి వరకు విమానంలో వచ్చిన ఆయన అక్కడ నుంచి హెలికాప్టర్ ఎక్కారు. ఏరియల్ సర్వేలో విద్యుత్ కేంద్రం, యాష్‌పాండ్‌ను చూడడంతోపాటు కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బందితో ముచ్చటించారు.

నెల్లూరు వంటకాలపై అంబానీ ఆసక్తి

అనిల్ అంబానీ కృష్ణపట్నం వచ్చిన సందర్భంగా విద్యుత్ కేంద్రం సిబ్బంది ఆయనకు 45 రకాల నెల్లూరు శాకాహార వంటకాలతో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. వివిధ రకాల వంటకాలను తిని ఇష్టపడ్డ ఆయన తన వెంట కొన్నింటిని హెలికాప్టర్‌లో తీసుకెళ్లాడు.

తేనెటీగల దాడి

మర్రిపాడు మండలం సన్నూరి వారి పల్లెలో పొగాకు తోటల్లో పని చేసేందుకు వెళ్లిన కూలీలు తేనెటీగల దాడికి గురయ్యారు. వీరు పనిలో వుండగా ఒక్కసారిగా వచ్చిన తేనెటీగలు వీరిని చుట్టుముట్టి ఎక్కపడితే అక్కడ కుట్టడంతో తీవ్రగాయాలైన వారిని 108 సహకారంతో ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

సిఎం రాకకు కోడ్ దెబ్బ

ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి జిల్లా పర్యటనకు బ్రేక్ పడింది. 12వ తేదీన ఆయన జిల్లాకు రావాల్సి వుంది. దీనికోసం అన్ని ఏర్పాట్లు చేస్తుండగా శాసనమండలి ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించడంతో కోడ్ అమలులోకి వచ్చింది. ఈ కారణంగా ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమం నిలచిపోనుంది.

ట్రాఫిక్ తిప్పలు

నగరవాసులకు నాయకుల కారణంగా తిప్పలు ఎదురౌతున్నాయి. వున్న విగ్రహాలు చాలవన్నట్లు ఆనం సోదరులు తమ బలం చాటుకొనేందుకు కరెంట్ ఆఫీస్ సెంటర్‌లో వైఎస్ విగ్రహం



ఫ్లెమింగో ఫెస్టివల్ ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాంగోపాల్. ప్రక్కన అదనపు జెసి సీతారామయ్య, జాయింట్ కలెక్టర్ సౌరభ్‌గౌర్.

ఏర్పాటు చేసేందుకు ఐలాండ్ నిర్మించారు. ఈ విగ్రహ పనుల కోసం రోడ్డుకు అడ్డదిడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్ దారిమళ్లించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నిప్పో సెంటర్ వద్ద నుంచి కొండాయపాళెం గేటు వరకు ఆటోలు, ఇతర వాహనాలను మళ్లించడంతో ప్రజలు 5వ తేది నుంచి అసౌకర్యానికి గురౌతున్నారు.

ఎఎస్‌పేటలో గంధమహోత్సవం!

అనుమసముద్రం పేటలో వెలసిన ఖాజా నాయబ్ రసూల్ స్వామి 237వ గంధ మహోత్సవం మార్చి 1వ తేదీ జరుగుతుంది. 11వ తేది హబీబా ఖాతున్నీసా(దొరసానమ్మ) గంధ మహోత్సవ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

వివేకాను నిలదీసిన నాగులమ్మ!

జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులను నోటికొచ్చినట్లు మాట్లాడే రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డిని 7వ తేది కోటమిట్టలోని షాదీ మంజిల్‌లో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో నాగులమ్మ అనే మహిళ నిలదీసింది. పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశ పెట్టామని గొప్పలు చెప్పుకోవడం కాదు. అవి మాకు అందడం లేదు. ఎవరికిస్తున్నారో అర్థం కావడం లేదు. నాకైతే రేషన్‌కార్డు లేదు. ఇంట్లో పెద్దలకు పింఛన్ రావడం లేదు. పక్కా గృహం లేదని గట్టిగా అడిగేసరికి కవరింగ్‌కు అర్జీ ఇవ్వు పరిష్కరిస్తానని చెప్పి వివేకానందరెడ్డి తప్పించుకొనే ప్రయత్నం చేశాడు.

తమాషాగా చోరీ

నెల్లూరు నగరంలో చోరీలు చిత్ర విచిత్రంగా జరుగుతున్నాయి. భక్తవత్సల నగర్‌కు చెందిన సురేష్‌బాబు 5వ తేది తన అవసర నిమిత్తం 40 గ్రాముల బంగారాన్ని కుదువబెట్టను స్కూటర్‌పై బయలుదేరాడు. ఆమని గార్డెన్స్ వద్దకు వచ్చేసరికి ఆయకు ఫోన్ వచ్చింది. స్కూటర్ ఆపి మాట్లాడుతుండగా ఇద్దరు యువకులు స్కూటర్‌పై వచ్చి పర్స్ కింద పడిందని చెప్పారు. సురేష్ వెనక్కు తిరిగి చూస్తుండగా పెట్రోల్ ట్యాంక్ మీద కవర్‌లో పెట్టివుండిన బంగారు నగల బ్యాగ్‌తో ఉడాయించారు. రోజంతా ఘరానా దొంగల కోసం తెగ తిరిగినా వాళ్లు కనపడకపోయే సరికి నాల్గవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ముత్యాలమ్మ జాతరకు ఘనంగా ఏర్పాట్లు!

తూర్పు కనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మ జాతరను పురస్కరించుకొని దేవస్థానంలో 25 లక్షల రూపాయలను వెచ్చించి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ వేమారెడ్డి మురళీమోహన్‌రెడ్డి తెలిపారు. మార్చి నెలలో జరిగే జాతరకు హాజరయ్యే భక్తుల సౌకర్యార్థం మరుగుదొడ్లు, స్నానపు గదులు, గ్రావెల్ రోడ్డు, ఉత్తరం వైపు పార్కింగ్ వసతి కల్పిస్తున్నామన్నారు. తాను ఆలయ ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకొన్నాక రెవిన్యూ శాఖ సహకారంతో 80 ఎకరాల ఆలయ భూమికి హద్దులు ఏర్పాటు చేశామన్నారు. పోలేరమ్మ గుడికి పది ఎకరాల భూమి ఇచ్చామని, 2.50 కోట్లతో ఆలయంలో వివిధ పనులు చేపట్టామన్నారు. దాతల సహకారంతో విద్యుత్ సౌకర్యం, క్యూలైన్లు, ఎక్కడికక్కడ మంచినీటి కొళాయిలను

కొరవ 14వ పేజీలో

HOME
కబోర్డు
DARGAMITTA, OPP: SINDICATE BANK, NLR.
TOTAL MATERIAL CONTRACT
వాటర్‌ప్రూఫ్ ప్లైవుడ్, రెండు వైపులా సన్‌మైకా
లేబరు, హార్డ్‌వేర్ మొత్తం కలిపి SFT. Rs.225/-
95506 82557,6526129

బంగారం స్పెషల్ ఆఫర్
BIS 916 హాల్‌మార్క్
బంగారు ఆభరణములపై
సవరకు రూ.400/- తగ్గింపు.
గ్రాముకు రూ.50/- తగ్గింపు.
డైమండ్స్ పై 10% తగ్గింపు.
గోల్డ్ ప్యాలెస్
హోటల్ శివం ఎదురుగా,
జిల్లా పరిషత్ ఆఫీసు సెంటర్,
ఆచారివీధి, నెల్లూరు.
ఫోన్: 2331133, 2327611



నెల్లూరులోని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ కార్యాలయం.

బాగా పనిచేస్తున్న విజిలెన్స్ శాఖ!

వినీతి, అక్రమాలు, అన్యాయాల నుంచి ప్రజలను రక్షించే బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులపై ఎంతో వుంది. నెల్లూరులో 50కిపైగా వున్న వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో పనిచేసే అధికారులు, ఉద్యోగులు ప్రతి విషయాన్ని ఉదాసీనంగా తీసుకోవడం వల్ల అన్నిచోట్ల అవినీతి అక్రమాలు విశృంఖలమైపోయాయి. మామూలుగా అవినీతి అక్రమాలపై అవినీతి నిరోధక శాఖాధికారులు దృష్టి సారిస్తారు. నెల్లూరులో మాత్రం ఈ మధ్య ఆ శాఖ పనితీరు చెప్పుకోతగ్గ స్థాయిలో లేదు. ఈ దశలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ మాత్రం ఎటువంటి వత్తిళ్లకు లొంగకుండా బాగా పనిచేస్తుంది. నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు జిల్లాల పరిధిలో వివిధ ప్రభుత్వ శాఖలు చేపడుతున్న పనుల్లో అవకతవకలతోపాటు ప్రజలకు అనునిత్యం అవసరమైన అన్ని విషయాలపై ఆ శాఖాధికారులు చురుకుగా పనిచేస్తున్నారు. సిబ్బంది తక్కువైనా ఎస్పీ మోహన్‌రావు, డిఎస్పీ బాబు, సిఐలు శ్రీనివాసులు నాయుడు, వేమారెడ్డి నేతృత్వంలోని బృందం కష్టపడి పలు అక్రమాలను పసికట్టి ప్రభుత్వానికి నివేదికలు పంపుతుంది. ఉపాధి హామీ పథకం, బియ్యం అక్రమ రవాణా, దారితప్పిన ప్రజాపంపిణీ వ్యవస్థ,

పలు అక్రమాలను వెలికితీసిన ఎస్పీ మోహన్‌రావు బృందం

దేవాలయాల్లో అవినీతి అక్రమాలతోపాటు ఈ వారంలో దాల్ మిల్లులపై చేసిన దాడుల్లో కోటి రూపాయలకుపైగా పప్పులను పట్టుకోగలిగారు. జిల్లాలో అధికారికంగా 70 దాల్ మిల్లులున్నాయి. వీటిలో కంది, మినుము, పెసర, వేరుశనగ, నువ్వులను ఆడించి పప్పులు చేస్తారు. కానీ ఆడించిన అనంతరం వీటిని మిల్లుల్లో స్టాక్‌చేయడం వల్ల కృత్రిమ కొరతతో పప్పుల రేట్లు మార్కెట్‌లో విపరీతంగా పెరిగిపోతున్నాయి. నెల్లూరు నగరంలోని ఐదు మిల్లులలోనే కోటి రూపాయలకు పైగా అక్రమ సరుకు బయట పడిందంటే, మొత్తంమీద జిల్లాలోని మిల్లులలో ఎంత అక్రమ సరకు వుంటుందనేది ఆలోచిస్తేనే తల తిరిగి పోతుంది. పౌరసరఫరాల శాఖ, రెవిన్యూ అధికారులు లంచాలు బాగా మరగడం వల్ల ప్రజాపంపిణీ వ్యవస్థ జిల్లాలో కునారిల్లుతుంది. ప్రచారార్భాటం లేకుండా అవినీతి అక్రమాలను నిశ్శబ్దంగా చేధిస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖకు ప్రజలు మద్దతుగా నిలవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

అసైన్‌మెంట్ కమిటీల్లో ఎమ్మెల్సీలు!

అసైన్‌మెంట్ కమిటీలో శాసన మండలి సభ్యులకు చోటు దక్కనుంది. ఇప్పటివరకు అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యేలకు మాత్రమే ఈ కమిటీలో ప్రాధాన్యత వుండేది. ఈ సంవత్సరం నుంచి ఎమ్మెల్సీలకు అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాస్థాయి అసైన్‌మెంట్ సమీక్ష కమిటీలో ఇన్‌ఛార్జి మంత్రి ఛైర్మన్‌గాను, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతోపాటు జాయింట్ కలెక్టర్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరక్టర్ సభ్యులుగా వుంటారు. రెవిన్యూ డివిజనల్ అధికారి సభ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి జిల్లా కలెక్టరేట్‌కు ఉత్తర్వులు అందాయి. ఈ కమిటీ ఆధ్వర్యంలో అసైన్‌మెంట్ భూముల పంపిణీ జరుగుతుంది.

సరికొత్త నిర్ణయం

పెద్ద దొంగలను తప్ప చిన్న దొంగలను పట్టరా?

● పనితీరు మెరుగుపర్చుకోని క్రైం పోలీసులు

నెల్లూరులో పగలు, రాత్రి తేడాలేకుండా దొంగతనాలు జరుగుతూనే వున్నాయి. అయితే విచిత్రంగా నెల్లూరు పోలీసులు పెద్ద పెద్ద దొంగతనాల విషయంలో చూపే శ్రద్ధను చిన్న దొంగతనాలపై చూపడం లేదు. పెద్ద దొంగతనాల రికవరీలో భారీగా నొక్కేయడానికి అలవాటుపడిన పోలీసులు చిన్న దొంగలను పట్టుకొనేందుకు తీరికే లేకుండాపోయింది. నెల్లూరు క్రైం విభాగంలో ఒకరికి ముగ్గురు ఇన్స్‌పెక్టర్లు, కావాల్సినంత మంది సిబ్బంది వున్నా దొంగలబారిన పడిన సామాన్యులను ఆదుకోవడంలో పూర్తిగా వైఫల్యం చెందుతున్నారు.



నెల్లూరులోని క్రైం పోలీస్‌స్టేషన్ పనితీరే వేరు.

జనవరి 20వ తేది విజయవాడకు వెళ్లి నెల్లూరు రైల్వేస్టేషన్‌లో దిగి స్కూటర్‌పై ఇంటికి వస్తుండిన సతీష్‌డైన్‌ను ములుమూడి బస్టాండ్ వద్ద అడ్డగించిన దొంగలు కత్తితో దాడిచేసి మూడున్నర కిలోల బంగారం, రెండున్నర లక్షల రూపాయల నగదు పట్టుకెళ్లడం సంచలనం సృష్టించింది. గతంలో చేధించినట్లుగానే ఈ కేసులో మూడు కిలోల బంగారం పోలీసులు రికవరీ చేయడంలో విజయం సాధించారు. స్థానికులైన నిందితులు విజయవాడ, ఊటి, చెన్నైలో వుండినా ప్రత్యేక బృందాలను పంపి పట్టివేయగలిగారు. ఈ వారంలో ఎస్పీ పత్రికా విలేకరుల సమావేశం పెట్టి ఈ వివరాలు వెల్లడించి అధికారులకు రివార్డులు ప్రకటించారు. ఈ కేసు మాదిరే పోలీసులు చిన్న కేసుల్లో రికవరీ చేస్తే పోలీసులను సామాన్యులు ప్రశంసిస్తారు. బంగారం, డబ్బు రికవరీ చేసిస్తే జీవితాంతం గుర్తు పెట్టుకొంటారు. క్రైం పోలీసులు ఇప్పటికైనా తమ పనితీరు మార్చుకొంటే బాగుంటుంది.



నెల్లూరు చెరువులో విషాదం!

పర్యాటకులను కాపాడబోయి ప్రాణాలు పోగొట్టుకొన్న బోటు డ్రైవర్

నెల్లూరు బారాషహీద్ దర్గానానుకొని చెరువు వద్ద పర్యాటక శాఖ నిర్వహిస్తున్న బోటు షికారుకు మంచి ప్రజాదరణ వుంది. శని, ఆది వారాల్లో వందల సంఖ్యలో పర్యాటకులు బోటు షికారుకు తరలి వస్తారు. 6వ తేది సాయంత్రం ఇదే విధంగా 20 మందితో బయలుదేరిన బోటులోని ఇద్దరు పర్యాటకులు చెరువులో పడిపోయారు. వీరిని రక్షించేయత్నంలో బోటును ఆపి చెరువులోకి దూకాడు డ్రైవర్ చిప్పల రంగారావు. ఈతరాని ఇద్దరు పర్యాటకులను రక్షించిన రంగారావు ప్రమాదవశాత్తు చెరువులో ఏపుగా పెరిగిన తూటాకు మొక్కలలో ఇరుక్కొని ఊపిరాడక మృతి చెందాడు. రంగారావుది గుంటూరు జిల్లా నిజాంపట్నం మండలంలోని వరయపురం గ్రామం. నాలుగు నెలల క్రితం పొట్టకూటి కోసం ఈ ఉద్యోగంలో చేరాడు. మార్చి 18వ తేది ఇతని వివాహానికి ఏర్పాటు జరుగుతుండగా ఈ విషాద ఘటన చోటుచేసుకోవడంతో నెల్లూరు చెరువు దగ్గర 6వ తేది సాయంత్రం విషాదఛాయలు అలుముకొన్నాయి. మామూలుగా బోటు షికారుచేసే పర్యాటకులందరికీ లైఫ్ జాకెట్లను పర్యాటక శాఖ సమకూర్చాలి. ఇవి వేసుకుంటే ఒకవేళ ఏదైనా ప్రమాదం జరిగినా ఎవరి ప్రాణాలు పోవు. కానీ ఆదివారం జరిగిన ప్రమాదాన్ని దగ్గర నుంచి చూస్తే డ్రైవర్ రంగారావుతోపాటు బోటులో వున్న ఏ ఒక్కరికీ లైఫ్ జాకెట్లు లేవు. ఏదైనా ప్రమాదం జరిగితే ప్రజల ప్రాణాలు గాలిలో దీపాలే. 6వ తేది జరిగిన ప్రమాదంలో ఇద్దరి ప్రాణాలు కాపాడి తను ప్రాణాలు కోల్పోయిన రంగారావు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి. అదేవిధంగా బోటు షికారు ప్రాంతంలో మరో ప్రమాదానికి ఆస్కారం లేకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాల్సి వుంది.

దేశాయిశెట్టి ముమ్మర ప్రచారం

నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాల పట్టభద్రుల శాసన మండలి స్థానం నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీచేస్తున్న దేశాయిశెట్టి హనుమంతరావు మూడు జిల్లాలలో ముమ్మర ప్రచారం చేస్తూ ఓటర్లను ఆకట్టుకొంటున్నారు. ఫిబ్రవరి 5వ తేది ఒంగోలులోని టిడిపి నాయకులతో కలసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1999 సంవత్సరం నుంచి తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నానని, 2007 సంవత్సరంలో ఈ స్థానం నుంచి పోటీచేసి ద్వితీయస్థానంలో నిలచానన్నారు. ఓటర్లు సహకరిస్తే గెలుస్తానన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. తనను మండలికి ఎన్నుకొంటే అన్ని రంగాల్లోని వ్యక్తుల సమస్యలతోపాటు, న్యాయవాదుల సమస్యలను ప్రత్యేక దృష్టి నిలిపి పరిష్కరిస్తానన్నారు. మూడు జిల్లాలోని 36 నియోజకవర్గాల పరిధిలో 180 మండలాలున్నాయని, వీటిలో లక్ష 86వేల మంది ఓటర్లున్నారని వివరించారు. హనుమంతరావు చేస్తున్న ప్రచారానికి ఓటర్ల నుంచి మంచి మద్దతు లభిస్తుండడంతో ఆయన ముందుకు సాగిపోతున్నారు.



హనుమంతరావుకు మద్దతుగా ప్రచారంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి.

ఉద్రిక్తతకు దారితీస్తున్న భూ సమస్యలు!

బలహీనవర్గాల వారికి ప్రభుత్వం పంపిణీ చేసిన భూములకు పట్టాలు అందజేయకపోవడం, ప్రభుత్వ భూములను ఇతరులు ఆక్రమించిన సందర్భాల్లో రెవిన్యూశాఖ సరిగ్గా స్పందించకపోవడం ఉద్రిక్తతలకు దారితీస్తోంది.



అల్లూరు మండలం సింగపేట గ్రామంలో సాగుచేస్తున్న భూములు.

రెవిన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామీణ ప్రాంతాలలో భూ సమస్యలు పరిష్కరించబడడం లేదు. చిన్న చిన్న సమస్యలను సైతం అధికారులు పట్టించుకోవడం లేదు. రైతులకు సంబంధించిన మాగాణి భూములకు హద్దులు చూపించడం, భూ పంపిణీ పథకం కింద బడుగు, బలహీనవర్గాల వారికి పంపిణీ చేసిన భూములకు పట్టాలు అందజేయక పోవడం, ప్రభుత్వ భూములను ఇతరులు ఆక్రమించడం వంటి సమస్యలపై రెవిన్యూ అధికారులు సరైన దృష్టి సారించడం లేదు. రెవిన్యూ అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడక తప్పడం లేదు.

భూ సమస్యలపైనే వినతి పత్రాలు

ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజావిజ్ఞప్తుల దినంలో అధికంగా భూ సమస్యలపై వినతి పత్రాలు అందుతున్నాయి. వీటిని స్వీకరించిన కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్వోలు సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని సంబంధిత మండల తహశీల్దార్లకు తిరిగి పంపుతున్నారు. జిల్లాలోని ఒక్క తహశీల్దార్ కూడా వీటిపై స్పందించిన దాఖలాలు మాత్రం కనిపించడం లేదు. సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడంతో బాధితులు మళ్లీ కలెక్టర్‌ను కలిసి తమ గోడును విన్నవించుకుంటున్నారు. ఒక దఫా సమర్పించిన అర్జీ మళ్లీ సమర్పించాల్సిన అవసరం లేదని అధికారులు చెబుతున్నా బాధితులు మాత్రం సంతృప్తి చెందడం లేదు.

ఒక ప్రక్క ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా వాటిని పరిరక్షించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తుంటే, మరో ప్రక్క భూ కబ్జాదారులకు రెవిన్యూ అధికారులు పరోక్షంగా సహాయ సహకారాలు అందిస్తున్నారన్న ఆరోపణలు వున్నాయి. జిల్లా కలెక్టర్ భూ సమస్యలపై మెతక వైఖరి అవలంభించడం అధికారుల నిర్లక్ష్యానికి కారణమని రాజకీయ పక్షాల నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఎన్ని ఆరోపణలు, విమర్శలు వచ్చినా తమకేం పట్టనట్లు రెవిన్యూ అధికారులు వ్యవహరిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని భూ సమస్యల వల్ల కొన్ని సందర్భాల్లో ఘర్షణ వాతావరణం చోటుచేసుకొని పోలీస్ స్టేషన్ల వరకు వెళ్తున్నాయి.

జిల్లాలోని నాయుడుపేట, చిల్లకూరు, సంగం, బుచ్చిరెడ్డిపాళెం, అల్లూరు మండల తహశీల్దార్లు భూ కబ్జాదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ పేద ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. భూ వివాదాల నేపథ్యంలో ఇరువర్గాలు అధికారులను సంప్రదిస్తే వెంటనే స్పందించి పరిష్కరిస్తారని ఎంతో ఆశతో వెళ్తే వీరి అవసరాలను ఆసరా చేసుకొని రెండు వర్గాల వారి నుంచి మామూళ్లు గుంజుకోవడం పరిపాటిగా మారిపోయింది. నెలలు, సంవత్సరాల తరబడి భూ వివాదాలు పెండింగ్‌లో వుంచుతున్నారు.

రెవిన్యూ సహకారం

సంగం మండలం అన్నారెడ్డి గ్రామ పంచాయితీ పరిధిలో పట్టాభూమిని ప్రభుత్వ భూమిగా భావించి ఒక భూస్వామికి పొలాల్లోకి వెళ్లేందుకు రోడ్డు నిర్మాణానికి తహశీల్దార్ సహకరించింది. బుచ్చి మండలం మునులపూడి గ్రామ పంచాయితీ పరిధిలోని రెడ్డిపాళెంలోని మాగాణి పొలాల్లోకి వెళ్లే రహదారిని అదే గ్రామానికి చెందిన కొండ్రెడ్డి వెంకటరమణారెడ్డి ఆక్రమించేందుకు ప్రయత్నించాడు. ఈ రహదారికి ప్రక్కనే వున్న ఖాళీ స్థలాన్ని తాను కొనుగోలు చేశానని, రహదారి కూడా ఖాళీ స్థలంలో భాగమని గ్రామస్తులను బెదిరిస్తున్నాడు. ఎన్నో సంవత్సరాల నుంచి పొలాల్లోకి వెళ్లేందుకు వినియోగిస్తున్న రహదారిని ఆక్రమించడంపై గ్రామస్తులు ప్రశ్నించడంతో వీరు రెండు వర్గాలుగా చీలిపోయే పరిస్థితి ఏర్పడింది.

రహదారి వివాదంపై బుచ్చి తహశీల్దార్‌కు గ్రామస్తులు విన్నవిస్తే గ్రామానికి వెళ్లిన తహశీల్దార్ రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో వెనుతిరగాల్సిన దుస్థితి ఏర్పడింది. అధికారులు పరిష్కార మార్గం చూపక పోవడంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అల్లూరు మండల తహశీల్దార్ శ్రీరాములు సమస్యలను పరిష్కరించడం మాని తన కార్యాలయానికి వచ్చిన బాధితులను మాటలతో సరిపుచ్చుతుంటాడు. ఇంతకంటే న్యాయం చేసే తహశీల్దార్ ఎవరుండరన్న భరోసా ఈయన మాటల్లో కనిపిస్తుంటుంది. భూ వివాదాల్లో రెండు వర్గాలను తన కార్యాలయానికి పిలిపించి న్యాయం చేస్తామని బాధితులకు ఒక ప్రక్క హామీ ఇచ్చి, మరోప్రక్క కబ్జాదారులకు అనుకూలంగా మారిపోతుంటాడు. ఇదే మండలంలో గోగులపల్లి గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 461లో దాదాపు 700 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములు వున్నాయి. వీటిని కొందరు ధనికులు సంవత్సరాల తరబడి అనుభవిస్తుంటే వీటి గురించి పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది. ఉప్పు పండే ఈ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని భూమిలేని పేదలకు పంపిణీ చేయాలని పలు దఫాలు దళిత సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు, ఆందోళనలు చేపట్టినా అధికారులు, ప్రజాప్రతినిధుల్లో ఏమాత్రం స్పందన కానరాలేదు. ఈ ప్రాంతంలో ప్రభుత్వ భూములున్నాయన్న విషయాన్ని రెవిన్యూ అధికారులు పూర్తిగా మరచిపోయినట్లు వ్యవహరిస్తున్నారు. అల్లూరు మండలానికి చెందిన కొందరు రాజకీయ నేతల గుప్పెట్లో ఈ భూములుండడంతో అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలూ వున్నాయి.

రచ్చబండలోనూ రచ్చ

గ్రామీణ ప్రాంతాల్లో పరిష్కారానికి నోచుకోని భూ సమస్యలు, భూవివాదాలపై గ్రామాలకు వెళ్తున్న అధికారులను ప్రజలు నిలదీస్తున్నారు. ప్రజలకు మద్దతుగా సిపిఎం, సిపిఐ, తెలుగుదేశం పార్టీలకు చెందిన నేతలు నిలుస్తున్నారు. రచ్చబండ కార్యక్రమం నిర్వహణకు అన్ని శాఖలకు చెందిన అధికారులు గ్రామాలకు వెళ్తుండడంతో ఇదే అదునుగా భావించిన గ్రామస్తులు గతంలో సమర్పించిన వినతి పత్రాలపై ఎటువంటి చర్యలు తీసుకున్నారో వెల్లడించాలని పట్టుబడుతున్నారు. ఇందుకు సరైన సమాధానం చెప్పలేని ఎంపిడిఓ, తహశీల్దార్లు ఇబ్బంది పడక తప్పడం లేదు. ప్రజల నుంచి ఎదురౌతున్న నిరసనలను తప్పించుకునేందుకు పోలీసు బందోబస్తు ముందుగా ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రచ్చబండ కార్యక్రమానికి గ్రామాలకు వెళ్తే ప్రజల నుంచి తప్పకుండా ప్రతిఘటన ఎదురౌతుందని ముందుగానే అధికార యంత్రాంగం ఊహించింది. ఊహించిన విధంగానే పరిణామాలు చోటుచేసుకోవడంతో స్థానిక ప్రజాప్రతినిధులచేత నాలుగు మాటలు మాట్లాడించి రెండు మూడు రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి గ్రామాల నుంచి బయట పడుతున్నారు. గతంలో అధికారుల దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేసి వుంటే ఇప్పుడు ఈ పరిస్థితులు ఎదుర్కొనే వారు కాదు. స్థానిక సంస్థల నుంచి ఎన్నికైన ప్రతినిధులతోపాటు ఎమ్మెల్యేలు సైతం గ్రామాలకు దూరంగా వుంటున్నారు. ఏదో ఒక కార్యక్రమంలో పాల్గొనే సమయంలో మాత్రమే గ్రామాల్లో దర్శనమిస్తున్నారు తప్ప మిగిలిన సమయాల్లో వీరి ఆనవాళ్లు కూడా కనిపించవు.

కలెక్టర్ స్పందించాలి

ప్రజాప్రతినిధులు రెవిన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సమస్యలు పేరుకుపోతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో రోజురోజుకు అధికమవుతున్న భూ వివాదాలను పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరం ఏర్పడింది. రెవిన్యూ అధికారులు పరిష్కరించాల్సిన భూ సమస్యలు, వివాదాలు తమకు సంబంధం లేదన్న విధంగా వ్యవహరిస్తున్నారు. స్వీకరించిన వినతిపత్రాలపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని చెబుతూ పోలీస్ స్టేషన్ల మెట్లు ఎక్కిస్తున్నారు. ఒక శాఖ ఆధ్వర్యంలో పరిష్కరింపబడాల్సిన సమస్య మరో శాఖపై నెట్టివేయడంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. ఒకరిపై మరొకరు పరస్పర ఫిర్యాదులు చేసుకొంటున్నారు. కొన్ని సందర్భాలలో రాజకీయ ఒత్తిళ్లతో రెండు వర్గాలపై కేసులు నమోదు చేయాల్సి వస్తోందని పోలీసులు వ్యాఖ్యానిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం, ఉదాసీన వైఖరి కారణంగా ఇప్పటికే భూ వివాదాలకు సంబంధించి సివిల్, క్రిమినల్ కేసులు వివిధ కోర్టులలో పెండింగ్‌లో వున్నాయి.

చందాదారులకు మనవి

- చందా పంపించేటప్పుడు తమ చందా నెంబరు, పూర్తి పేరు, చిరునామా తెలియ పరచండి.
- మీ చందా నెంబరు, చందా ఏ తేదికి అయిపోతుందో, అడ్రసు రేపరు మీదనే ముద్రించి వుంటుంది.
- 'జమీన్‌రైతు' చందాదార్లు తమ చందాను ఎం.ఓ/డి.డి లేదా On- lineలో ఆంధ్రాబ్యాంక్, విఆర్‌కాలేజి బ్రాంచి, నెల్లూరు అకౌంట్ నెంబర్: 106811011000423లో ZAMINRYOT పేరుతో జమచేయ వచ్చు. సకాలంలో చందా చెల్లించ వలసినదిగా కోరుతున్నాము.
- చెక్కులు స్వీకరించబడవు.

జీవిత చందా రూ.1000/-

సంవత్సర చందా

స్వదేశంలో రూ.200/-

విదేశాలకు రూ.1000/-

జమీన్‌రైతు

పాగతోట, నెల్లూరు - 524 001

ఫోన్: 0861 - 2327354

సెల్: 98489 66190

చేయి తడిపితేనే పని!

తోటపల్లి గూడూరు వ్యవసాయాధికారి తీరిది

అసలే అన్ని విధాలా నష్టపోయిన రైతులను కమీషన్ల పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నాడు తోట పల్లి గూడూరు మండల వ్యవసాయాధికారి ఇవి.రమణ. కొన్నేళ్లుగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఆయన ఏ పని చేయాలన్నా చేయి తడపాల్సిందేనట. తొలుత మంచి అధికారిగా పేరు తెచ్చుకొన్న ఆయన తర్వాత కాలంలో కమీషన్లకు కక్కుర్తి పడడం గగ్గోలు రేపుతోంది. తుఫాను కారణంగా జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసే సర్వేలోనూ పెద్దఎత్తున అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా కోడూరు, కొత్తకోడూరు గ్రామాలలో పలువురు రైతులు పెసర పంట వేసి బాగా నష్టపోయారు. వారికి పరిహారం అందజేయడంలో అవకతవకలకు పాల్పడ్డాడట. తనకు పర్సంటేజిలు ఇచ్చే రైతులకు పరిహారం అందించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు విమర్శలు వినవస్తున్నాయి. ఆదర్శ రైతులు సక్రమంగా పనిచేయకపోయినా వారి విషయంలోనూ పక్ష పాత ధోరణి అవలంభించడం, వారు గ్రామాల్లో లేకపోయినా, కార్యక్రమాలకు హాజరుకాకపోయినా వారికి జీతభత్యాలు చెల్లించడం ఆ అధికారి వైఖరికి అద్దం పడుతున్నాయి. పరిహారం పంపిణీ చెక్కుల విషయంలోనూ పర్సెంటేజీలు తీసుకోవడమేకాక, బినామీ పేర్లతో నిధులు స్వాహాచేశారని రైతుల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చివరకు సబ్సిడీ పనిముట్ల పంపకం, ఎరువుల అంగళ్లకు లైసెన్సుల మంజూరులోనూ చేతివాటం ప్రదర్శించడంపై మండలస్థాయిలో చర్చ జరుతోంది.



బోగోలు మండలం జక్కేపల్లిగూడూరులో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్పీడిఓ విజయేంద్ర కుమార్, స్పెషలాఫీసర్ కె.రమేష్, ఎమ్మార్వో లలితారాణి, ఎస్ఐ వీరేంద్రబాబు.

వెంకటగిరిలో ఉచిత మెగా వైద్యశిబిరం

ఎమ్మెల్యే సహకారంతో విజయవంతం

వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చారిటబుల్ ట్రస్టు, మద్రాసుకు చెందిన రక్షిత హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్యశిబిరం జరిగింది. వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు ఈ వైద్య శిబిరంలో పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించడమే కాక ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గుండె, ఎముకలు, కాలేయం, దంతాలు, చెవి ముక్కు గొంతు, నరములు, గర్భకోశ, చిన్నపిల్లలకు సంబంధించి జరిగిన వైద్య శిబిరంలో దాదాపు 4వేల మంది రోగులు పాల్గొన్నారు. స్థానిక విశ్వోదయ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరాన్ని వెంకటగిరి ఎమ్మెల్యే రామకృష్ణతోపాటు సూళ్లూరుపేట ఎమ్మెల్యే పరసారత్నం పాల్గొని ప్రారంభించారు. వైద్యసేవలు అందించిన వైద్యులందరికి జ్ఞాపికలను బహూకరించారు. ప్రజాసమస్యలపై పోరాటం చేస్తున్న రామకృష్ణ వైద్యశిబిరాలు నిర్వహించడాన్ని పరసా రత్నం అభినందించారు.




జల్ తుఫాన్ బాధితులను ఆదుకోవాలని కోవూరు మండలం పాటూరులో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి.

ముంగమూరు రోడ్డు దారుణం!


ప్రజల బాధ పట్టేదెవరికి?

అభివృద్ధి కార్యక్రమాలకు దూరంగా సమస్యలతో సహవాసం చేస్తుంది ముంగమూరు గ్రామం. బోగోలు మండల పరిధిలో గల ఈ గ్రామంలో రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా వుంది. సరైన రోడ్లు లేక, రవాణా సౌకర్యం లేక గ్రామస్తులు పడుతున్న బాధలు అన్ని ఇన్ని కావు. ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు సైతం గ్రామబాగోగులు గురించి పట్టించుకోకపోవడంతో అన్ని విధాల వెనుకబడిపోయింది. అసలే అంతంత మాత్రంగా వున్న రోడ్లు గత ఏడాది సంభవించిన తుఫానుల కారణంగా పూర్తిగా ధ్వంసం అయ్యాయి. పాఠశాలలకు వెళ్లే పిల్లల దగ్గర్నుంచి ప్రతిఒక్కరు రవాణా సౌకర్యం లేకపోవడంతో నడచిపోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆస్పత్రికి వెళ్లాలన్నా కాలినడకే దిక్కు. అంతగా గ్రామస్తులు బాధలు పడుతున్నా అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం పట్ల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఎన్నికలలో ఆయా పార్టీల విజయావకాశాలను నిర్ణయించే ముంగమూరు గ్రామం నేడు అభివృద్ధికి దూరంగా వుంది. బీద మస్తాన్‌రావు ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి అధికారికంగా ఏ కార్యక్రమం ఇక్కడ చేపట్టలేదు. పంచాయితీరాజ్‌శాఖ సాంబశివపురం రోడ్డు నిర్మాణానికి టెండర్లు పిలిచి నాలుగు నెలలైనా రోడ్డు పనులు ప్రారంభంకాలేదు. జడగోగుల, కోళ్లదిన్నె, ఏనుగులబావి, జువ్వలదిన్నె, రాముడుపాళెం ప్రాంతాల ప్రజలు బస్సులు లేక ప్రయాణాలకు పలు అవస్థలు పడాల్సి వస్తోంది.



జన్మదిన శుభాకాంక్షలు

మనసున్న మంచి మనిషి, సేవాతత్పరులు
CRWDS సేవా సంస్థ అధ్యక్షులు మరియు డైరక్టర్
శ్రీ యేగూరి జాకబ్‌గారు, B.Com., B.Ed.,
బిట్రగుంట, చెంచులక్ష్మీపురం.
2011 ఫిబ్రవరి 4వతేది 37వ సంవత్సరంలోకి అడుగిడిన
శుభసందర్భముగా వారికి మా హార్దిక జన్మదిన శుభాకాంక్షలు.
కుమారులు: టోని జయకర్, సన్నీ అబ్రహాం
స్టాఫ్ & చిల్డ్రన్ - కన్‌సోల్ ఆర్ఫన్‌హోం



ఏ నిర్ణయం తీసుకోవాలి?

మాదాల జానకిరాం సమాలోచన

మాజీమంత్రి మాదాల జానకిరాం రాజకీయంగా ఏ నిర్ణయం తీసుకుంటారనే దానిపై సర్వత్రా చర్చనీయాంశమైంది. సుదీర్ఘకాలం కాంగ్రెస్‌లో కొనసాగిన ఆయన కొన్నాళ్ల క్రితం తెలుగుదేశం పార్టీలో చేరి కావలి నియోజకవర్గం నుంచి శాసనసభకు పోటీ చేశాడు. ఆ ఎన్నికలలో ఓటమి చవి చూసిన ఆయన తిరిగి ఉదయగిరి నియోజకవర్గంలో చక్రం తిప్పేందుకు, రాజకీయంగా తిరిగి పూర్వ వైభవాన్ని పొందేందుకు తనవంతు ప్రయత్నాలు చేస్తున్నాడు. మరోవైపు ఆయన అనుచరులు, అభిమానుల నుంచి ఏదైనా నిర్ణయం తీసుకొని రాజకీయాలలో తిరిగి ప్రముఖపాత్ర పోషించాలని ఒత్తిళ్లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో నర్రవాడ వచ్చిన ఆయన అతిథి గృహంలో మండల నాయకులు, అనుచరులతో మంతనాలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ సమీకరణలలో నియోజకవర్గంలో చోటు చేసుకొంటున్న పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. అందరితో చర్చించి సరైన సమయంలో తగిన నిర్ణయం తీసుకొంటానని స్పష్టం చేశారు. తిరిగి క్రియాశీల రాజకీయాలలో ప్రవేశించి చురుకైన పాత్ర పోషించాలని అభిమానులు కోరుకొంటున్నారని తెలిపారు. మొత్తం మీద మాదాల జానకిరాం రాజకీయంగా తీసుకొనే నిర్ణయం ఏమిటనేది అంతుచిక్కకుండా వుంది.

గూడూరు రచ్చబండలో రభస

ప్రజారాజ్యం కార్యకర్తల నిలదీత

గూడూరు పట్టణంలో జరిగిన రచ్చబండ కార్యక్రమం రసాభాసగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు వివిధ కార్యక్రమాలకు మొక్కుబడిగా హాజరు కావడం, ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించడం తప్ప వాటి పరిష్కారానికి కృషి చేయడం లేదని ప్రజారాజ్యంపార్టీ, పలువురు ప్రజలు నిలదీశారు. పురపాలక పరిధిలో జరిగిన రచ్చ బండ కార్యక్రమానికి ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్ ఇతర అధికారులు హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభం కాగానే బల్లి ప్రసంగించబోతుండగా వీరు అడ్డుతగిలారు. పేదలకు రేషన్‌కార్డులు, ఇళ్లస్థలాలు, ఫించన్లు, అంత్యోదయ కార్డులు మంజూరు చేయాలంటూ పెద్దఎత్తున నినదించారు. దీనికి ఎమ్మెల్యే దుర్గాప్రసాద్ స్పందిస్తూ ప్రభుత్వం నుంచి లబ్ధిపొందినవారు సైతం సమస్యలు పరిష్కారం కావడం లేదని అర్జీలు సమర్పించడం మంచి పద్ధతి కాదన్నారు. మరోవైపు అనర్హులు ప్రభుత్వ పథకాలు కావాలంటూ వస్తే అసలైన అర్హులకు అన్యాయం జరిగే అవకాశం వుందన్నారు. ఈ విషయాన్ని అర్జీదారులు గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ పూర్ణచంద్ర రావు, తహశీల్దార్ పెంచలకిషోర్ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణపట్నంలో రిలయన్స్ అల్ట్రా మెగా విద్యుత్ కర్మాగారం పనులను పరిశీలిస్తున్న అనిల్ అంబానీ.

కావలిలో పెచ్చుపెరిగిన భూ ఆక్రమణలు!

కావలి డివిజన్‌లో దళితులకు ఇచ్చిన భూములను కబ్జాదారులు ఆక్రమించుకొంటున్నారని, వీరికి కొందరు రెవెన్యూ సిబ్బంది అండదండలు అందిస్తున్నారని దళిత సంఘర్షణసమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి ఆరోపించారు. దగదర్తి మండలం దామవరం గ్రామంలో సర్వేనెంబర్ 230లో 120 ఎకరాల దళిత, గిరిజన భూములను కబ్జా చేసేందుకు పలువురు ప్రయత్నిస్తున్నారన్నారు. అల్లూరు మండలంలోని గోగులపల్లి గ్రామంలో 180 ఎకరాలు, వెలుపొడు గ్రామంలో 300 ఎకరాలు ఆక్రమించుకొన్నారని తెలిపారు. పెద్దఎత్తున జరిగిన ఈ భూకుంభకోణంపై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. తిప్ప దిగువ భాగంలో సింగపేట పంచాయితీ పరిధిలో గల భూములను తెలుగుదేశం నేతల అండదండలతో మత్స్యకారులు ఆక్రమించుకొన్నట్లు చెప్పారు. ఈ ఆక్రమణలపై ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ జరిపి దళితులు, గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు.

స్పందించని రెవిన్యూశాఖ

ప్రజా సమస్యలు పరిష్కరించండి! రచ్చబండలో కురుగొండ్ల

కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రులుగా వున్నవారు ప్రజలు తమను మర్చిపోకుండా వుండేందుకు రచ్చబండలు, ప్రజాపథంలు నిర్వహిస్తున్నారని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ విమర్శించారు. సైదాపురం మండలంలోని అనంతమడుగు, వేమలచేడు, లింగసముద్రం, తిప్పరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన ప్రభుత్వ తీరుపై విమర్శలు సంధించారు. గతంలో జరిగిన ప్రజాపథం కార్యక్రమంలో ప్రజలు వివిధ సమస్యలపై ఇచ్చిన అర్జీలకే దిక్కులేదని, వాటిని పరిష్కారించకపోవడం వల్లనే అర్జీలు వెల్లువెత్తుతున్నాయన్నారు. ప్రజలు పింఛన్లు, పక్కాగృహాలు, ఇళ్లస్థలాల కోసం అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా న్యాయం జరగడం లేదని ఆవేదన చెందారు. కనీసం రచ్చబండకు వచ్చిన అర్జీలనైనా పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని అధికారులకు సూచించారు.

రచ్చ... రచ్చ!

పరిహారంపై ముంగలదొరువులో నిలదీత

తుఫాన్ల కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందజేయడంలో అన్యాయం జరిగిందంటూ బాధితులు అధికారులను నిలదీయడంతో తోట పల్లిగూడూరు మండలం ముంగలదొరువు గ్రామంలో జరిగిన రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రత్యేకాధికారి రవిచంద్ర ప్రసాద్, ఎంపిడిఓ సుజాత, తహశీల్దార్ లక్ష్మీ నారాయణలు హాజరయ్యారు. అధికారులు ఈ కార్యక్రమ ఉద్దేశ్యాన్ని వివరిస్తుండగా స్థానికులు ఒక్కసారిగా అడ్డుతగిలారు. ఇటీవల సంభవించిన భారీ వర్షాలు, జల్, లైలా తుఫాన్ల కారణంగా పంటనష్టం జరిగినా ఇంతవరకు పరిహారం పంపిణీ చేయలేదంటూ బాధితులు అధికార్లను నిలదీయడంతో రచ్చబండలో రసాభాసగా మారింది. పంట నష్టం జరిగి అన్నివిధాలా నష్టపోయిన వారికి కాకుండా అసలు పొలాలే లేని వారి పేర్లతో పరిహారం ఎలా పంపిణీ చేస్తారని నిలదీశారు. అలాగే స్థానికంగా డ్రైనేజి, పారిశుద్ధ్య సమస్యలను చాలా కాలంగా ఎదుర్కొంటున్నా ఒక్కదాన్నీ పరిష్కరించేందుకు రాని అధికారులు తగుదునమ్మా అంటూ రచ్చబండ కార్యక్రమానికి ఏముఖం పెట్టుకొని వచ్చారని ఆగ్రహించిన బాధితులు తమ గ్రామంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి వీలులేదంటూ గొడవకు దిగడంతో పోలీసులు జోక్యం చేసుకొని శాంతింపజేయాల్సి వచ్చింది.


శిథిలావస్థలో సోమేశ్వరాలయం

వందల ఎకరాల ఆస్తి వున్నా పూజలేవి?

బోగోలు మండలంలోని సోమేశ్వరాలయం శిథిలావస్థకు చేరుకొనింది. చోళులకాలంలో నిర్మితమైన ఈ దేవాలయానికి వందల ఎకరాల భూములు వుండేవి. కాలక్రమేణా ఆ భూములన్నీ లీజుదారుల చేతుల్లోకి పోవడంతో సోమేశ్వరుడికి ధూపదీప నైవేద్యాలు పెట్టే దిక్కుకూడా లేకుండా పోయింది. దేవాలయంపాడు పంచాయితీ పరిధిలో గల ఈ ఆలయానికి స్థానికంగా 127 ఎకరాలు, సింగరాయకొండలో 180 ఎకరాలు, పాకాలలో మరికొంత భూమి వుంది. ఇంతపెద్ద ఆస్తులున్న దేవాలయం శిథిలమైపోతున్నా పట్టించుకొనేవారే లేకుండా పోవడంతో కూలిపోయే స్థితికి చేరుకొంది. భూముల మీద వచ్చే రాబడి ఎవరికి చేరుతుందో? దానిని దేనికి ఖర్చు చేస్తున్నారో తెలియడం లేదు. దేవాలయంలో గల దేవతలు, నందీ విగ్రహాలు కళావిహీనంగా తయారైనాయి. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని దేవాలయంలో ధూపదీప నైవేద్యాలు జరిగేలా చూడడంతోపాటు శిథిలావస్థకు చేరుకొన్న ఆలయానికి జీర్ణోద్ధరణ జరపాలని స్థానికులు కోరుకొంటున్నారు.

● మాటలు చెప్పను చేతల్లో చూపిస్తా!

కావలిలో మునిసిపల్ మంత్రి



మునిసిపాల్టీ పరిధిలో చేపట్టిన పనులను సక్రమంగా, సకాలంలో పూర్తి చేయని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెడతామని పురపాలకశాఖ మంత్రి మానుగుంట మహిధర్‌రెడ్డి హెచ్చరించారు. కావలి మునిసిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని మునిసిపాలిటీలకు భారీఎత్తున నిధులు విడుదల చేస్తున్నామని, ప్రజలకు అందించాల్సిన సౌకర్యాల కల్పనలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. తాగునీటి సరఫరాకు, పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. కావలి మునిసిపాలిటీ పరిధిలో ఫిబ్రవరి 15వతేదిలోగా పాలిథిన్ కవర్ల వాడకాన్ని పూర్తి స్థాయిలో నిషేధించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పట్టణంలో పందుల సంచారం అధికంగా వుందని, వీటి నిర్మూలనకు తగినచర్యలు చేపట్టాలన్నారు. రామ్మూర్తిపేటలోగల సాయిబాబాగుడి వీధిలో అడ్డదిడ్డంగా ఏర్పాటు చేసిన బంకుల్ని తొలగించాలని ఆదేశించారు. తాను మాటలు చెప్పే మంత్రిని కాదని చేతల్లో అభివృద్ధిని చూపిస్తానని చెప్పారు.

సంస్కృతిని తెలియజెప్పేవి ఆలయాలు!



పూర్వీకుల సంస్కృతిని తెలియజేసే ఆలయాలను, కట్టడాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై వుందని సర్వేపల్లి శాసన సభ్యుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ముత్తుకూరు మండలం బ్రహ్మదేవం గ్రామంలో శ్రీ కైలాసనాధేశ్వర ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. చరిత్ర, అలనాటి ప్రాభవాన్ని ప్రస్తుత తరానికి తెలిపేందుకు ఆనవాళ్లు పురాతన కట్టడాలేనని తెలిపారు. ఆయా ప్రాంతాలను పరిపాలించిన రాజులు వారి పాలనకు గుర్తుగా వివిధ కట్టడాలను, దేవాలయాలను నిర్మించారని చెప్పారు. బ్రహ్మదేవంలోని ఈ ఆలయం చోళ రాజులు నిర్మించిందని, శిథిలమైన దేవాలయ పునరుద్ధరణకు 35లక్షల రూపాయలతో అంచనాలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. 10శాతం దాతలు వెచ్చిస్తే

బ్రహ్మదేవంలో ఆదాల

మిగతా మొత్తాన్ని ముఖ్యమంత్రితో చర్చించి మంజూరు చేయిస్తామన్నారు. అనంతరం ఆలయట్రస్టు బోర్డు ఛైర్మన్‌గా కట్టా సుబ్రహ్మణ్యం, పాలకమండలి సభ్యులుగా కొత్తపల్లి రమేష్‌శర్మ, శ్రీనివాసులరెడ్డి, ప్రకాశం, రమణమ్మలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్పీపి మెట్టా చంద్రశేఖర్‌రెడ్డి, పెన్నాడెల్టా కమిటి ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, ఈదూరు రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాష్పాంజలి - దశమ వర్ధంతి



శ్రీమతి అక్కరాజు లక్ష్మి

జననం: 10-03-1936 మరణం: 14-02-2001

భర్త : A.T. శ్రీనివాసరావు
Retd. HOD, V.R.C, Nellore

కుమారుడు : A. వెంకటరమణ, M.Tech
C.A.O Indian Ports Association, New Delhi

కోడలు : A. సుష్మ, B.Tech,

కుమార్తెలు : R.S. భువనేశ్వరి, MA MEd.,
K. జానకి, MSc., BEd.,
T. పద్మజ, MSc, Phd., (USA)

అల్లుళ్లు : Major General R.S. Kumar,
CEO. NSDM, New Delhi
Dr. K.V.L.N. Rao, BSc., MBBS
Dr. TVSH. Prasad, M.S. Phd.,U.S.A

మనుమలు : R. ధీరజ్, 4th year MBBS
A. విశ్వత్థ్


మనుమరాళ్లు : R. సంధ్య, B.Tech (USA)
R. విష్ణుప్రియ, 3rd year B.Tech
J. జ్యోత్స్న, B.Tech (USA)
A. ఋతిక, T. శ్రావ్య, T. సౌమ్య

పాపం కిరణ్!!



సిఎం కిరణ్‌కుమార్‌రెడ్డి పరిస్థితి చూస్తుంటే జాలేస్తోంది. రచ్చబండ పేరుతో 'జనం'లోకి వెళ్తున్నా కూడా తనకు రావల్సినంత పేరు రావడం లేదని కిరణ్ మధనపడుతున్నాడు. తెలుగు భాష అంతగా పలకలేకపోతుండటం కిరణ్‌కు మైనస్‌గా మారింది. ఉప న్యాసాలు కూడా నీరసంగా వుండటంతో రచ్చబండకు వస్తున్న జనంకు ఆవలింతలు వస్తున్నాయట. రచ్చబండ హాజరీపై సిఎం అన్నిరకాల ముందస్తు చర్యలు తీసుకుంటున్నా కూడా అక్కడక్కడా జనం ఈసడింపులు వినిపిస్తుండటం కూడా కిరణ్‌కు ఇబ్బందిగా వుంది. సీమాంధ్రలో రచ్చ బండ ఒక మాదిరిగా నడుస్తున్నా... తెలంగాణాలో మాత్రం రొచ్చురొచ్చుగా వుండటం కిరణ్‌కు కంటి మీద కునుకు లేకుండా చేస్తోందట. 2014 ఎన్నికల్లో చిరంజీవి కాబోయే కాంగ్రెస్ సిఎం అంటూ ప్రచారం ఊపందుకోవడంతో కిరణ్ పావులారిటీ మరీ తగ్గిపోతున్నట్లు నిఘా వర్గాలు సిఎంకు నివేదించాయట. పాపం కిరణ్ పేరుకు సిఎం అయినా సుఖం మాత్రం దక్కడం లేదన్నది రాజధాని రాజకీయవర్గాల ఉవాచ!

సిఎం సిఫార్సుకు గవర్నర్ బ్రేక్



రాష్ట్ర పరిపాలన ట్రిబ్యునల్ సభ్యుడిగా సిఎం ఏరికోరి సిఫార్సు చేసిన దిలీప్‌రెడ్డి నియామకానికి గవర్నర్ బ్రేక్ వేశారు. జర్నలిస్ట్‌గా వున్న దిలీప్ రాష్ట్ర సమాచార కమిషనర్‌గా అయిదేళ్లపాటు పని చేశారు. అది కూడా గౌరవభృతిపైన. రాష్ట్ర పరిపాలనలో ఏమాత్రం అనుభవం లేకుండా కేవలం సమాచార కమిషనర్‌గా పని చేసినంత మాత్రాన ట్రిబ్యునల్ సభ్యుడిగా నియమించడానికి గవర్నర్ గట్టి కొర్రీనే వేశారట. దీంతో సిఎం కిరణ్‌కుమార్‌రెడ్డికి ఎదురు దెబ్బతగిలినట్లయింది. వైఎస్‌ఆర్ పుణ్యాన సమాచార కమిషనర్ అయిన దిలీప్ తన పదవీకాలం పూర్తవడంతో ట్రిబ్యునల్ పదవి కోసం సిఎంను ఆశ్రయించాడు. సిఎం కూడా ప్రత్యేకశ్రద్ధ తీసుకొని, సీనియర్ ఐఎఎస్‌లను కాదని దిలీప్ పేరును గట్టిగా సిఫార్సు చేశాడు. అయితే తానొకటి తలిస్తే మరొకటి అయిందన్నట్లు కథ అడ్డం తిరిగింది. అయినా సిఎం మాత్రం పట్టువదలకుండా దిలీప్‌కు పునరావాసం కల్పించడానికి శ్రమ పడుతున్నట్లు సచివాలయంలో చెవులు కొరుక్కుంటున్నారు.

జగన్ ఎదురీత




పాలవరం పాదయాత్ర చేస్తున్న జగన్‌కు జనం బాగానే వస్తున్నా... ఎమ్మెల్యేలు మాత్రం తగ్గిపోవడం తలనొప్పిగా మారింది. ఒక దశలో 30 మంది ఎమ్మెల్యేల మద్దతు వుందంటూ కాలరెగరేసిన జగన్‌కు ఇప్పుడు ఆ సంఖ్య 12కు తగ్గటం ఇబ్బందిగా మారింది. చిరంజీవి కాంగ్రెస్ జెండాను భుజానికెత్తుకోవడం కూడా ఎమ్మెల్యేల సంఖ్య తగ్గటానికి కారణమైందంటూ రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నారు. జగన్ చేపట్టిన హరిత యాత్రలో జనం బారులుతీరి వస్తుండటం ఒక్కటే కాస్తంత ఊరట కలిగిస్తోందట. వచ్చే రెండు నెలల్లో ఎమ్మెల్సీ పదవులతోపాటు మంత్రివర్గ మార్పుచేర్పులు, కార్పొరేషన్ ఇతర ప్రభుత్వ సంస్థల పదవుల పందారం జరగబోతోంది. పదవులు ఆశిస్తున్నవారు ఒక్కొక్కరుగా జగన్ వర్గానికి మొఖం చాటేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో సుమారు మూడేళ్లు నెట్టుకు రావడం జగన్‌కు కష్టమే. చూద్దాం... జగన్ ఎలా ఎదురీదుతాడో!!

'మగధీర'కు కష్టాలు



మెగాస్టార్ చిరంజీవి తనయుడు చరణ్‌కు సినీ కష్టాలు మొదలయ్యాయి. చరణ్ నటించిన తొలి చిత్రం 'చిరుత' 'చిరు' క్రేజ్‌తో బాగానే ఆడింది. ఇక ఆ తర్వాత వచ్చిన 'మగధీర' తెలుగు చలన చిత్ర రికార్డుల్ని తిరగరాసింది. తన మేనల్లుడి భవిష్యత్తు కోసం మేనమామ అల్లు అరవింద్ 42 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి మగధీరను నిర్మించాడు. తెలుగు సినిమా రేంజ్‌కు 42 కోట్ల రూపాయల పెట్టుబడి చాలా ఎక్కువే అయినా మొత్తం మీద అల్లువారు బయటపడగలిగాడు. ఆ తర్వాత చరణ్ మూడో చిత్రం 'ఆరెంజ్' బాక్సాఫీసు దగ్గర బొక్కబోర్లా పడింది. ఇక నిర్మాణంలో వున్న నాలుగో చిత్రం 'మెరుపు' అయినా గట్టెక్కిస్తుందనుకుంటే సదరు నిర్మాత జేబులు ఖాళీ అవడంతో అదికాస్తా అటకెక్కింది. దీంతో షూటింగ్‌లు లేక చరణ్ ఇంటి పట్టునే ఉంటున్నాడు. చరణ్‌కు మగధీర పెద్ద హిట్ ఇవ్వడంతో ప్రేక్షకులు కూడా అదే రేంజ్‌లో తదుపరి చిత్రాల్ని కూడా ఆశిస్తుండటంతో చరణ్‌కు కష్టాలు తప్పడం లేదు!

'అల్లు'పై చిరు'జల్లు'



ప్రజారాజ్యం పార్టీ కాంగ్రెస్‌లో విలీనం చేస్తాం! అయితే అల్లు అరవిందకు మాత్రం ఖచ్చితంగా రాజ్యసభ సీటు ఇవ్వాలంటూ చిరంజీవి ఢిల్లీ అధిష్టానానికి తెగేసి చెప్పారట. ప్రజారాజ్యం పార్టీ ఏర్పాటు అల్లు బ్రెయిన్ ఛైల్డ్ అంటూ చిరంజీవి పదేపదే గుచ్చిగుచ్చి చెప్పడం కాంగ్రెస్ అధిష్టాన పెద్దలకు ఆశ్చర్యం కలిగించినట్లు అభిజ్ఞ వర్గాల భోగట్టా. అల్లుకు రాజ్యసభ యిచ్చాకనే మిగతా పదవుల పందారం చేయాలని చిరు చేసిన మొదటి డిమాండ్‌కు అధిష్టానం అసహనంగానే తలూపినట్లు ప్రజారాజ్యం జనం చెవులు కొరుక్కొంటున్నారు. అసలు అల్లు వారి ఆగడాల వల్లనే ప్రజారాజ్యం పార్టీకి ఇన్ని తిప్పలు వచ్చిన సంగతిని 'చిరు' మరచిపోయినట్లుందని ప్రజారాజ్యం వర్గాలు పెదవి విరుస్తున్నాయి. ఏదైతేనేం చిరంజీవి తన బామ్మర్ది 'రుణం' తీర్చుకున్నాడు. పార్టీ ఎటుపోయినా బామ్మర్ది క్షేమంగా వుంటే చాలనుకున్నాడంటూ ఆ వర్గాలు నోటి మీద వేలేసుకుంటున్నాయి.

ఎనభైపళ్లుగా 'జమీన్‌రైతు'ను తమ అభిమాన పత్రికగా
ఆదరిస్తున్న పాఠకులకు ఈ కొత్త సంవత్సరంలో ప్రత్యేక కానుకగా
"లిఛార్జబుల్ టార్చ్‌లైట్" అందిస్తున్నాము.
1-12-2010 నుండి 31-3-2011 మధ్య కాలంలో
చందా చెల్లించిన వారందరికీ ఈ కానుక అందుతుంది!

సంవత్సర చందా రూ.200/-

జీవిత చందా రూ.1000/-

చందా చెల్లించిన వెంటనే రశీదుతోపాటు కానుక అడిగితీసుకోండి.
ఇతర ప్రాంతాల నుంచి ఎం.ఓ. లేదా డి.డి (చెక్కులు స్వీకరించబడవు)
ద్వారా చందా పంపేవారు స్కీమ్ కాలపరిమితి ముగిసేలోగా
మా కార్యాలయానికి వచ్చి కానుక స్వీకరించాలి.
కానుకను పోస్టులో పంపడం సాధ్యం కాదు.

జమీన్‌రైతు

వెంకటరమణ హోటల్ మిద్దెపైన, పాగతోట,
నెల్లూరు - 524 001. ఫోన్: 0861 - 2327354.

సాహసోపేత వార్తా చిత్రిక - జమీన్‌రైతు వారపత్రిక

పాఠకులకు



ప్రత్యేక కానుక



విద్యార్థుల ఫీజు రీఎంబర్స్‌మెంట్ జాప్యానికి నిరసనగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చేపట్టిన దీక్షకు మద్దతుగా నెల్లూరు గాంధీబొమ్మ వద్ద దీక్ష చేస్తు బిజెపి జిల్లా అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి తదితరులు.



మహిమాన్వితమైనది మాఘమాసం!

తెలుగు నెలల్లో పదకొండవది మాఘం. ధార్మిక పరంగా ఈ మాసం చాలా మహిమాన్వితమైనది. చంద్రుడు మఖానక్షత్రంలో ప్రవేశించడం వల్ల ఈ మాసానికి మాఘమాసం అనే పేరొచ్చింది. విష్ణుమూర్తికి ప్రీతిపాత్రమైన ఈ మాసం ఎంతో పుణ్యప్రదమైనది. అంతేకాకుండా మరే మాసంలోను వుండనన్ని పర్వదినాలు ఈ మాసంలో వుంటాయి. సూర్యభగవానుడు తన గమనగతిని మార్చుకొనే రథ సప్తమి, భీష్మపితామహుడు స్వచ్ఛంద మరణాన్ని పొందిన బీష్మ ఏకాదశి, మహాపూర్ణిమగా పేరొందిన మాఘపూర్ణిమ పర్వదినం, చదువుల తల్లి సరస్వతిదేవి ప్రాదుర్భవించిందీ ఈ మాసంలోనే. ఉపనయనం, వివాహాది శుభకార్యాలకు మాఘ మాసం చాలా మంచిది. అందుకే ఈ మాసం కోసం ఎదురు చూడని వారంటూ వుండరు.


మాఘమాసంలో ప్రతి తిథీ పుణ్యవంతమైనదే. అయినప్పటికీ వీటిలో మాఘ పూర్ణిమకు విశేష మహత్యముంది. ఆ రోజున ఉదయాన్నే స్నానం చేసి విష్ణుభగవానుని పూజించాలి. పితరులకు తర్పణం ఇవ్వడం, వికలాంగులు, పేదలకు భోజనం, వస్త్రాలు ఇవ్వడం వలన పుణ్యం కల్గుతుందట. అలాగే మాఘమాసంలో ఒక్క పూట భోజనం చేసి రెండవ పూట ఉపవాసం వున్నట్లయితే మంచిదని పురాణాలు చెప్తున్నాయి. ఈ మాసంలో వచ్చే ఆదివారం పుణ్యభరితం. మాఘ పాది వారం నోములు నోచుకొని, సూర్యభగవానుని పూజించి పాయసం నివేదిస్తే సకల సంపదలు కల్గుతాయని ప్రతీతి.

మాఘమాసంలో వచ్చే మాఘశుద్ధ సప్తమిని రథ సప్తమి అంటారు. ఇది సూర్య సంబంధమైన పర్వదినం. విద్య, బుద్ధి, జ్ఞానం. వాక్కులకు అధిదేవత అయిన సరస్వతి దేవి ఆవిర్భవించిన పర్వదినం మాఘపంచమి. దీనినే శ్రీపంచమి అంటారు. ఆనాడు సరస్వతి దేవిని పూజించినట్లయితే ఆమె అనుగ్రహం కల్గి బుద్ధి, జ్ఞానం కల్గుతాయి. మాఘ మాసంలో వస్త్రాలతోపాటు అన్నదానం చేసినట్లయితే అనంతమైన ఫలాలను పొందుతారని పురాణోక్తి.

జపం, వ్రతం, దానం, తపస్సు తదితరాలతో శ్రీహరిని సంతృప్తి పరచలేకపోయినా కేవలం మాఘమాసంలో మాఘ స్నానాలు చేయడం వలన విష్ణువు ప్రసన్నుడై భక్తులను సర్వ పాపాల నుంచి విముక్తి చేసి కోరిన కోర్కెలన్నీ తీరుస్తాడని పద్మపురాణం ఉత్తర ఖండంలో మాఘమాస మహత్యాన్ని గురించిన వర్ణన కన్పిస్తుంది.

ట్రంకు రోడ్డు

నెల్లూరు కాకా... పనబాక!




కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీని నానా మాటలని సీనియర్ కాంగ్రెస్ నేత... కాకాగా ప్రసిద్ధులైన జి.వెంకటస్వామి వార్తల్లో నిలచిన విషయం విదితమే. 'కాకా' కేంద్రజౌళి శాఖ మంత్రి పన బాక లక్ష్మి పతిదేముడు గూడూరు నియోజకవర్గ ఇన్ ఛార్జి కృష్ణయ్యను ఆకర్షించినట్లుంది. కాకా ధోరణిలోనే నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో 4వ తేది కేకలు పెట్టారాయన. ప్రజారాజ్యంతో కాంగ్రెస్ పార్టీ ఎందుకు పొత్తులు పెట్టుకోవాలి? రాష్ట్ర నాయకత్వాన్ని సంప్రదించకుండా కోర్ కమిటీ సభ్యుడు ఆంటోని హైదరాబాద్ ఎందుకు రావాలి? ఆంధ్రాలో పిఆర్పీ దుకాణం ఎప్పుడో మూతపడిపోయిన విషయం తెలియదా? అంటూ ఆయన కురిపించిన ప్రశ్నల వర్షానికి విస్తుపోవడం విలేకరుల వంతయ్యింది.

ఎంత మంచి వారయ్యా...



ప్రత్యేక తెలంగాణ వుద్యమం బాగా నడుస్తుండిన నేపథ్యంలో ఆంధ్రా ప్రాంతీయులైన హీరోలు జూనియర్ ఎన్టీఆర్, బాలకృష్ణ, పవన్ కళ్యాణ్ నటించిన చిత్రాలు తెలంగాణ ప్రాంతంలో విడుదలైన సందర్భంగా అక్కడి నేతలు, వివిధ సంఘాల నాయకులు సృష్టించిన రభస అంతా ఇంతా కాదు. అదే జైబోలో తెలంగాణ అంటూ ప్రత్యేక తెలంగాణ వుద్యమాన్ని సమర్థిస్తూ తీసిన చిత్రం నెల్లూరులో విడుదలైతే ఆ థియేటర్ వద్దకు వెళ్లి చిన్న పాటి నిరసన తెలియజేసిన నేత, ప్రజాసంఘాలు లేవు. సినిమాను లైట్ తీసుకొని నెల్లూరీయులు చూసివస్తూ 'ఎంతమంచి వాడవురా' పాటను గుర్తుకు తెస్తున్నారు.

వివేకాను నిలువరించారు!



నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి మాట వేదవాక్కని అందరికీ తెలిసిందే. ఏ రాజకీయ పార్టీ నాయకుడు, జిల్లా అధికారి ఆయన జోలికి వెళ్లను జడుస్తున్నారు. కాని ఇద్దరు అధికారులు వివేకాకు భయపడకుండా నిర్ణయాలు తీసుకొని హీరోలయ్యారు. కరంటాఫీసు దగ్గర వైఎస్ విగ్రహం ఏర్పాటు పేరిట వివేకానందరెడ్డి నిబంధనలకు విరుద్ధంగా కట్టించబోయిన ట్రాఫిక్ ఐలాండ్ గోడల నిడివిని ఆర్‌అండ్‌బి సిఇ ఆయనకు తెలియకుండానే తగ్గించి వేశారు. అదేవిధంగా విఆర్ కాలేజీలో పెరిగిన లెక్చరర్ల జీతాల విషయమై వివేకానందరెడ్డి పంపిన రికార్డులు సరిలేవంటూ జిల్లా ఆడిట్ ఆఫీసర్ తిరస్కరించారు. ఈ విషయమై కోపం నషాలానికి అంటిన వివేకా తన ముందు హాజరవమన్నా... ఆడిట్ అధికారి ఆ అవసరం లేదంటూ సున్నితంగా తిరస్కరించిన విషయమై ట్రంకురోడ్డులో భలే చర్చ జరుగుతోంది.

కూరగాయల ధరలు దిగాయి!



గత ఆరేడు నెలలుగా కొండెక్కి కూర్చొని వుండిన కూరగాయల ధరలు ఈ వారంలో కాస్త క్రిందికి దిగి రావడంతో నెల్లూరీయుల ఆనందానికి అవధులు లేవు. టమోటా కిలో ధర 40 నుంచి 10 రూపాయలకు దిగగా, యాభై నలభైల మధ్య వుండిన వంకాయలు, బెండకాయలు, కాకరకాయలు, బీన్స్, చిక్కుళ్లు 20 రూపాయలయ్యాయి. మహిళల కంట నీరు తెప్పించిన ఎరగడ్డలు 50 రూపాయల నుంచి 20 రూపాయలకు దిగడంతో ఈ రేట్లు ఇలాగే వుండాలని జనం దేవదేవుళ్లను మొక్కుతున్నారు.



నెల్లూరులో చైనా తెల్లగడ్డలు

ప్రపంచీకరణ మూలంగా చైనాలో తయారయ్యే వివిధ వస్తువులు భారతదేశ మార్కెట్‌లో ఇబ్బడిముబ్బడిగా దొరుకుతున్నాయి. మిగతా దేశాల వస్తువులతో పోల్చుకొంటే చైనా వస్తువులు కాస్త చౌకగా దొరకడంతో జనం వీటికోసం ఎగబడుతున్నారు. ఇటీవల కాలంలో దేశంలో ఎరగడ్డలు, తెల్లగడ్డలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఇక్కడి డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని పాకిస్తాన్ మార్కెట్ నుంచి ఎరగడ్డలు, చైనా మార్కెట్ నుంచి తెల్లగడ్డలు మనదేశానికి వచ్చాయి. చైనా నుంచి నెల్లూరు వచ్చిన తెల్లగడ్డలు దేశీయ గడ్డలకన్నా నాణ్యతాపరంగా బాగున్నాయి. దేశీయ గడ్డలు పచ్చివి కిలో 360 రూపాయలమ్ముతుంటే చైనా తెల్లగడ్డలు కిలో 300 రూపాయలకే దొరుకుతూ నెల్లూరీయులను ఆకర్షించడం ట్రంకు రోడ్డులో చర్చనీయాంశమయ్యింది. అయితే చైనా తెల్లగడ్డలు రుచిలో మన గడ్డలతో పోటీ మాత్రం పడలేకపోతున్నాయి.



మేషం
అశ్వని, భరణి, కృత్తిక 1 పా

కళత్ర సౌఖ్యం, మానసికానందం కలుగుతాయి. సోదర వర్గ బలం మీకు బాగా కలసివస్తుంది. పరోపకార తత్వంతో మెలుగుతారు. నమ్మిన అనుచరులే మీకు వెన్నుపోటు పొడిచే ప్రమాదముంది. మెలుకువగా వ్యవహరించండి. కొత్తవారితో పరిచయం కలుగుతుంది. ప్రయాణాలు అనుకూలిస్తాయి. రాజకీయ నాయకులు అసంతృప్తి, అసహనంతో ఉంటారు. జాగ్రత్త వహించండి.



వృషభం
కృత్తిక 2,3,4 పా. రోహిణి, మృగశిర 1,2 పా

వారం మొదట్లో ప్రతి అంశంలోనూ ఆచితూచి ముందడుగు వేయండి. ఇతరుల వల్ల మోసపోయే సూచనలున్నాయి. ఆర్థికంగా లోటుండదు. పనుల్లో జాప్యం కలుగుతుంది. శుభకార్య యత్నాలు మొదలు పెట్టడానికి అనుకూల సమయం. విద్యార్థులు బద్ధకం తగ్గించుకొంటే సఫలత కలుగుతుంది. అనాలోచితంగా తీసుకొనే తొందరపాటు నిర్ణయాల వల్ల భవిష్యత్తులో ఇబ్బందులెదుర్కొంటారు.



మిథునం
మృగశిర 3,4 పా. ఆర్ద్ర,పునర్వసు,1,2,3 పా

వ్యవహార జయం, ఆరోగ్య సిద్ధి, అనుకూల ప్రయాణాలు కలుగుతాయి. స్త్రీలు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి. వ్యాపారులకు మొదట అంతంత మాత్రంగానే ఉన్నా తర్వాత లాభాలు వస్తాయి. వారం మొదట్లో ధనలాభం, కొత్తవారితో పరిచయాలు. సహనం, సంయమనం అవసరం. కుటుంబసభ్యులతో చిన్నపాటి మాట పట్టింపులు, అభిప్రాయ భేదాలు కలుగుతాయి.



కర్కాటకం
పునర్వసు 4 పా. పుష్యమి, ఆశ్లేష

ఎదురుచూసిన బదిలీలు, మార్పులు చోటుచేసుకొంటాయి. నూతన వ్యక్తులతో మెలకువగా నడచుకోవాలి. దైవపూజలలో పాల్గొనాలి. అధికంగా ఖర్చు చేసినా తృప్తి ఉండక పోవచ్చు. దూరప్రయాణాలు నిరుపయోగాలు. వాయిదా పడ్డ పనులలో కొంత ముందంజ కాన వస్తుంది. నూతన ప్రయత్నాలు చక్కని ఫలితాలనిస్తాయి. కుటుంబంలో ఆనందదాయకమైన సంఘటనలు చోటుచేసుకొంటాయి.



సింహం
మఖ, పుబ్బ ఉత్తర 1 పా

నూతన వాహనప్రాప్తి లేదా వాహన రిపేర్ల అవకాశాలున్నాయి. వృత్తి అభివృద్ధికి తోడ్పడే వ్యక్తుల్ని కలుసుకొంటారు. ఉద్యోగరీత్యా ఎదురుచూసిన ఆర్థిక లాభాలు చేతికందివస్తాయి. చుట్టుపక్కల వారితో, బయటప్రపంచంతో సత్సంబంధాలుంటాయి. ఇల్లు, ప్లాటు మొదలైనవి కొనే ప్రయత్నాలు ఊపందుకొంటాయి. రియల్ ఎస్టేట్ వ్యవహారాలు లాభకరంగా ముగుస్తాయి.



కన్య
ఉత్తర 2,3,4పా, హస్త, చిత్తా 1, 2 పా

అనవసర ఆలోచనలతో మనసు గజిబిజిగా ఉంటుంది. పాత మిత్రులు కలుస్తారు. చిరకాలంగా నిలిచిపోయిన బాకీలు కొద్దిపాటి నష్టాలతోనైనా వసూలవుతాయి. ఆదాయ, వ్యయాలు సమపాళ్ళలో ఉంటాయి. ఉద్యోగులకూ, విద్యార్థులకు ఒకింత పరీక్షా కాలం. అయినప్పటికీ ప్రతిభ, ఆలోచనా శక్తితో ముందడుగు వేస్తారు. ఇంటర్వ్యూలలో గట్టి పోటీ ఎదురౌతుంది.

వారఫలాలు

తేది 12-2-2011 నుండి 18-2-2011 వరకు మకరకుంభాల్లో రవి, కుజులు; మకరంలో బుధుడు; ధనుస్సులో శుక్ర, రాహు వులు; మీనంలో గురువు; కన్యలో శని; వృషభ, మిథున, కర్కాటకాల్లో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగం

శుభ ముహూర్తాలు

12తేది సింహ లగ్నాన రా.7.00 నుండి 8.30 గంటల వరకు.
16తేది మేష లగ్నాన ఉ.10.00 నుండి 12.00 గంటల వరకు.
18తేది తులా లగ్నాన రా.11.00 నుండి 1.00 గంట వరకు శుభ ముహూర్తాలున్నాయి.

ఫిబ్రవరి తిథులు

మాఘ శుద్ధ

12	శని	నవమి	రా.2.01	గం.ల.వ
13	ఆది	దశమి	రా.1.53	గం.ల.వ
14	సోమ	ఏకాదశి	రా.11.53	గం.ల.వ
15	మంగళ	ద్వాదశి	రా.11.05	గం.ల.వ
16	బుధ	త్రయోదశి	రా.8.35	గం.ల.వ
17	గురు	చతుర్దశి	సా.5.30	గం.ల.వ
18	శుక్ర	పౌర్ణమి	మ.2.01	గం.ల.వ

పి.ఎం.గోపాలాచారి
16/1020, పొగతోట, నెల్లూరు – 1.
E-mail:maripmgg@yahoo.com



తుల
చిత్తా 3,4 పా, స్వాతి, విశాఖ 1,2,3 పా

స్థిరాస్తి సంబంధ ఆలోచనలు భవిష్యత్తులో ఫలిస్తాయి. కొత్త వస్తువులు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతారు. ఆలోచనా విధానం సరిగా లేకపోవడం వల్ల, బద్ధకం కారణంగాను, ముఖ్యమైన పనులు వాయిదా వేయడం వల్ల అనూహ్య ఇబ్బందులు ఎదురౌతాయి. వృత్తి, హోదా రీత్యా గౌరవప్రదమైన స్థానంలో ఉన్నప్పటికీ ఆ స్థానానికి న్యాయం చేయడం కష్టమవుతుంది.



వృశ్చికం
విశాఖ 4 పా, అనూరాధ, జేష్ఠ

తలపెట్టిన పనులు పూర్తవుతాయి. దైవక్షేత్ర సందర్శన సూచితమవుతున్నాయి. మీ మాటకు విలువ, గౌరవం పెరుగుతాయి. సాహస కార్యనిర్వహణ ఫలిస్తుంది. కళాకారులకు ప్రోత్సాహం. వాదాల్లో జయం మీదే. అవివాహితులకు శుభవార్తా శ్రవణం. అయితే ప్రతి పనిలోనూ చివరి వరకూ ఉత్కంఠ, తద్వారా ఆందోళన, క్షోభ నెలకొంటాయి. ఉదర సంబంధిత అనారోగ్యం తలెత్తే సూచనలున్నాయి.




ధనస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా

స్వల్ప మార్పు చేర్పులతో కార్యసిద్ధి, ముఖ్యమైన వ్యవహారాల్లో గోప్యత పాటించండి. బిడియాన్ని వీడి చొరవగా దూసుకుపోండి. వ్యవసాయదారులకు శ్రమాధిక్యత. ప్రయాణాలు తాత్కాలికంగా వాయిదా వేస్తేనే మంచిది. సుఖసంతోషాలతో కాలక్షేపం చేస్తారు. వ్యవహార జయం, కొన్ని వ్యవహారాలలో మధ్యలో ఆటంకాలెదురైనా ధైర్యంతో పట్టుదలగా వ్యవహరించి చివరకు జయం పొందుతారు.



మకరం
ఉత్తరాషాఢ 2, 3,4 పా. శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా

కుటుంబ వ్యవహారాల్లో సంయమనం పాటిస్తే మంచి ఫలితం వుంటుంది. తొందరపాటు వల్ల అనర్థమే తప్ప ప్రయోజనం ఉండదని గ్రహించండి. బద్ధకాన్ని వదలి శ్రమ పడగలిగితే అందుకు తగిన ప్రతిఫలం తప్పక పొందుతారు. తలకు సంబంధించిన అనారోగ్యం వచ్చే సూచనలున్నాయి. ముఖ్యులైన వ్యక్తుల్ని కలుసుకొంటారు. తద్వారా మీ పనులు చక్కదిద్దుకొంటారు.



కుంభం
ధనిష్ఠ 3,4 పా. శతభిషం, పూర్వ భాద్ర 1,2,3 పా

నూతన కార్యక్రమాలకు ఉపక్రమిస్తారు. ప్రతి పనిని ప్రతిష్ఠాత్మకంగా పూర్తిచేస్తారు. కుటుంబములో అశాంతి, అసౌఖ్యం ఉన్నా ఆ పరిస్థితి తాత్కాలికమే. వృత్తి వ్యాపారాలు బలోపేత మవుతాయి. సంతానం విషయంలో జాగ్రత్త అవసరం. దైవకార్యాల నిమిత్తం డబ్బు ఖర్చు చేస్తారు. ప్రణాళికా బద్ధమైన నడవడితో ముందుకు సాగుతారు. అకారణ విరోధాలు తలెత్తే ప్రమాదం కూడా ఉంది.



మీనం
పూర్వాభాద్ర 4 పా, ఉత్తరాభాద్ర, రేవతి

పని విషయంలో తొందర, కోపం ఉంటాయి. సాహస కార్యాలు చేయడానికి వెనుకాడరు. ఇంట్లో శుభకార్యం జరగాలన్న కోరిక సిద్ధిస్తుంది. కుటుంబసభ్యులతో ఆనందంగా గడుపుతారు. ఉద్యోగులు, కళాకారులు మాత్రం సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. అనుకోని అనవసర ఖర్చులు చేస్తారు. కొన్ని వ్యవహారాల్లో మీ శ్రమ బూడిదలో పోసిన పన్నీరవుతుంది.

ఈశాన్య భ్రష్ట స్థలాలు స్త్రీకి ఆస్తి సంక్రమణ ఫలాలు!

పైడిపాల రఘునాధరెడ్డి చెన్నై

** వారి యింటికి ఈశాన్యం లోపించి మగ సంతతి అంగవైకల్యంతో బాధపడి చనిపోయారు. స్త్రీలకు వైధవ్యం తర్వాత ఆస్తి దక్కింది!*

ఈశాన్యం లోపించడం, విపరీతంగా పెరగడం అన్నది 'భ్రష్టత'కు సూచకం. మీరు చెప్పినవిగాక యజమాని దీర్ఘవ్యాధి పీడితుడవుతాడు. 'సుదర్శన యంత్రం' యాభై శాతం దుష్ఫలితాలను నిలువరిస్తుంది.

ఎన్.సుకుమార్‌రెడ్డి కడప

** పెద్దన్న మరణించాక భాగ పరిష్కారం చేసుకోవాలనుకుంటున్నాము. విధవ ముందు భాగంలో వుండవచ్చా?*

మీ స్థలాలు పశ్చిమ వైపు వున్నాయి. పెద్ద కుమారుడికి, పెద్ద కోడలికి దక్షిణ, పశ్చిమ ప్రధమ స్థలాలు దక్కాలి. అన్న మరణించినందు వల్ల వదినకు వెనుక స్థలం ఇవ్వజూపడం శాస్త్రవిరుద్ధం. ఆమెకు ముందు స్థలం న్యాయంగా ఇవ్వండి. లేనిపక్షంలో తర్వాతి వాళ్లను 'అపుత్ర దోషం' వెంటాడుతుంది.

కోడూరు రత్నప్రభ సికింద్రాబాదు

** మీరు సెప్టిక్‌ట్యాంకు ఏ మూలా వుండ కూడదంటున్నారు. ఎందువల్ల?*

మూలల్లో గుంతలు ఏర్పడి 'అగాధ భ్రంశ' దుష్ఫలితాలు గృహస్థుకు కలుగుతాయి. వాయువ్యం మేధోపతనం, ఆర్థిక, పురుష సమస్యలు. నైరుతి పురుష, స్త్రీ ఆరోగ్య సమస్యలు. ఆగ్నేయం స్త్రీ, బాలుర సమస్యలు. ఈశాన్యం సర్వనాశనం జరుగుతాయి. వీటి నిర్మూలనకు నిర్మాణానికి కొంత సమయం కావాలనుకొంటే 'శీతల యంత్రం' ప్రతిష్ఠించుకోవాలి.

పి.జానకిరామయ్య ఒంగోలు

** భర్త చనిపోయాక చెల్లెలు ఇంట్లోనే వుంది. విధవ ఆడపడుచు ఇంట్లో వుంటే యజమానికి మృత్యువంటున్నారు.*

తల్లిదండ్రులు కూడా లేని చెల్లెలి బాధ్యత ముమ్మాటికీ మీదే. ఆడవాళ్ల మత్సరగ్రస్తమైన మాటల్ని నమ్మకండి. ఇటువంటి విషయాల్లో శాస్త్రం చెప్పే దానికన్నా మానవతా దృక్పథం మిన్న!

డి.సుబ్బారాయుడు కడప

** తులసికోట ఇంటి ముందు, ప్రహరీకి ముందు జిల్లేడు, చింత చెట్టు వుండవచ్చా?*

ఇంటి ముందు అంటు, పాదరక్షల ప్రవేశాలు వుంటవి గనుక తులసికోట నిషిద్ధం. ఇంటికి ప్రహరీకి ఆవలవైపు ఏ చెట్టునైనా పెంచుకోవచ్చు.

వాస్తు సందేహాలు సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్టు, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

పి.అనంతమ్మ నెల్లూరు

** అష్టమి, అమావాస్య, చతుర్దశి ఇవి ఎప్పుడు పాటించాలి?*

శుభకార్యక్రమాలు, శంకుస్థాపనలు, సింహద్వార ప్రతిష్టలు ఈ రోజులలో కూడదు! స్థలాల వాస్తు, ప్లానులు చూపించడానికి ఈ రోజులు నిషిద్ధం కాదు!

డాక్టర్.ఎ.వి.నారాయణ బెంగుళూరు

** ఈశాన్య కుంభ ప్రతిష్టకు నిష్ణాతులు లేరన్నారు. మరి సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయం ఏమిటి?*

'వాస్తు రత్నాకరం'లో ఈ ప్రస్తావన వుంది. దానికి ప్రత్యామ్నాయం 'సుదర్శన యంత్ర' ప్రతిష్ట అని చెప్పారు.

బి.దశరధరామయ్య ఆత్మకూరు

** యంత్ర ప్రతిష్ట, రత్నధారణ తర్వాత అనుకోని విధంగా మా కుటుంబం కోలుకుంది!*

శాస్త్రం శక్తివంతమైనది. నమ్మకం ఔషధం వంటిది. శాస్త్రాన్ని మీరు నమ్మితే, శాస్త్రం మిమ్మల్ని గట్టెక్కించింది. ఇందులో ఏమాత్రం ఆశ్చర్యం లేదు.

పి.విశ్వనాధనాయుడు చిత్తూరు

** అపార్టుమెంటులో 'ప్లాటు వాస్తు' బాగుంటే చాలా?*

కనీసం నివసించే ఇళ్లయినా వాస్తు ప్రకారం వుండాలని అలా చెబుతారు. బాహ్య, అంతర వాస్తు దోషాల ప్రభావం గృహస్తులందరిపై వుంటుంది.

అమ్మకానికి అంగన్‌వాడీ వర్కర్ల పోస్టులు!



నియంత్రణ లేని స్త్రీ శిశు సంక్షేమశాఖ కార్యాలయం.

ఒక్కో పోస్టుకు డిమాండ్‌ను బట్టి 30వేల రూపాయల నుంచి 50వేల వరకు ధర నిర్ణయించి కొందరు రాజకీయ దళారులు ఎమ్మెల్యేల పేరు చెప్పి వసూళ్లు చేస్తున్నారు.

జిల్లాలో త్వరలో భర్తీ చేయనున్న అంగన్‌వాడి వర్కర్ల నియామకాలకు ఇప్పటినుంచే బేరసారాలు సాగుతున్నాయి. స్త్రీ, శిశు అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం (ఐసిడిఎస్) క్రింద 17 ప్రాజెక్టులు వున్నాయి. ఈ ప్రాజెక్టుల పరిధిలో క్రొత్తగా కేటాయించిన కేంద్రాలు, గతంలో ఖాళీ ఏర్పడిన కేంద్రాల్లో అంగన్‌వాడి వర్కర్ల నియామకాల కోసం గత నెలలో నోటిఫికేషన్ జారీ చేశారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో 8వ తరగతి పాసైన వారు కూడా అంగన్‌వాడి వర్కర్ల పోస్టులకు అర్హులుగా నిర్ణయించారు. దీంతో ఈ పోస్టులకు మంచి డిమాండ్ ఏర్పడింది.

దరఖాస్తు గడువు ముగిసిన నాటి నుంచి రాజకీయ దళారులు పోస్టులు ఇప్పిస్తామంటూ రంగప్రవేశం చేసి మహిళలకు గాలం వేస్తున్నారు. ఒక్కో పోస్టుకు డిమాండ్‌ను బట్టి రూ.30వేల నుంచి 50వేల రూపాయల వరకు ధర నిర్ణయించారు. రాజకీయ దళారులు ఎమ్మెల్యేల పేరు చెప్పి జనాన్ని బుట్టలో వేసుకొనేందుకు అన్ని ప్రయత్నాలు సాగిస్తున్నారు. ప్రాజెక్టుల వారీగా దరఖాస్తు చేసిన వారి జాబితాను అధికారుల సహకారంతో సేకరించి ఒక్కో కేంద్రానికి ఎంతమంది దరఖాస్తు చేశారో తెలుసుకొంటున్నారు. దరఖాస్తు చేసిన వారి ఆర్థికస్థితి తెలుసుకొని వారితో అంగన్‌వాడి వర్కర్ల నియామకాల గురించి చర్చలు జరుపుతున్నారు.

ఒక్కో ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో రెండు, మూడు మండలాలు వున్నాయి. అంగన్‌వాడి వర్కర్ల ఎంపిక సంబంధిత నియోజకవర్గ ఎమ్మెల్యే, ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ, ప్రాజెక్టు డైరెక్టర్, అదనపు జాయింట్ కలెక్టర్ సమక్షంలో జరుగుతుంది. నిబంధనల ప్రకారం స్థానికులకే అవకాశం వుంటుంది. అయితే రాజకీయ దళారులుగా చెప్పుకొంటున్న వారు ఎమ్మెల్యే కోటాలో పోస్టు ఇప్పిస్తామని ప్రచారం చేసుకొంటూ వేలాది రూపాయలు సులభంగా సంపాదించేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. సంబంధితశాఖ అధికారులు దళారుల మాట నమ్మి మోసపోవద్దని ప్రకటిస్తున్నా ఎలాగైనా అంగన్‌వాడి వర్కర్ పోస్టును దక్కించుకోవాలన్న ఆశతో దరఖాస్తుదారులు అడ్డదారులను వెతుక్కొంటున్నారు.

సందెట్లో సడేమియా

రాజకీయ దళారులు పైవిధంగా వ్యవహరిస్తుంటే ఐసిడిఎస్ కార్యాలయాల్లో పనిచేసే కొంతమంది సిబ్బంది సిడిపిఓలు, సూపర్‌వైజర్లు సందెట్లో సడేమియా అన్నవిధంగా వ్యవహరిస్తున్నారు. వీరికి పరిచయం వున్నవారి ద్వారా అంగన్‌వాడి వర్కర్‌గా ఎంపిక చేయిస్తామంటూ నమ్మబలుకుతున్నారు. అంగన్‌వాడి వర్కర్‌గా ఎంపిక చేయాలంటే పిడి, సిడిపిఓలకు కొంత నగదు అందజేయాల్సి వుంటుందని, ఈ విషయం బయటకు చెప్పరాదంటూ చెబుతున్నట్లు తెలిసింది. దీంతో కొందరు అంగన్‌వాడి వర్కర్లు సిడిపిఓ, సూపర్‌వైజర్ల నివాసాల చుట్టూ తిరుగుతున్నారు.

అంగన్‌వాడి వర్కర్ల ఎంపికలో గ్రామాల్లో రాజకీయ ఆధిపత్యం చోటు చేసుకుంటుంది. తమకు కావాల్సిన వారిని అంగన్‌వాడి వర్కర్‌గా ఎంపిక చేయించుకోవాలన్న లక్ష్యంతో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ద్వితీయ స్థాయి నేతలు పోటీలుపడే పరిస్థితి కనిపిస్తుంది. గతంలో జరిగిన ఎంపికల్లో కూడా పలువురు అనర్హులను ఈ పోస్టులకు ఎంపిక చేశారన్న ఆరోపణలు వచ్చాయి. ఈ సారైనా ఎంపిక సమయంలో నిబంధనల ప్రకారం అధికారులు, ఎమ్మెల్యేలు వ్యవహరిస్తారో లేదో వేచి చూడాలి.

కక్ష సాధింపు

20వ డివిజన్ ప్రజలపై కక్ష సాధింపు!


"రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డిని వ్యతిరేకిస్తూ నగరంలో జగన్ వర్గం నేతగా మారిన పోలుబోయిన అనిల్‌కుమార్‌కు మద్దతునిస్తున్నారన్న కక్షతో 20వ డివిజన్ ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ పథకాలు అందకుండా అడ్డుపడుతున్నారు."

రాజకీయ విబేధాల నేపథ్యంలో ఏర్పడిన కక్షలను ప్రజలపై తీర్చుకుంటున్నారు నాయకులు. రాజకీయాలలో ప్రత్యర్థులను రాజకీయంగానే ఎదుర్కోవాలన్న సంగతి మన ప్రజాప్రతినిధులు పూర్తిగా మర్చిపోయారు. ప్రజలపై తమ ప్రతాపాన్ని చూపిస్తున్నారు. వీరి కక్షల కారణంగా పేద, బడుగు బలహీనవర్గాల ప్రజలు ఇబ్బంది పడకతప్పడం లేదు. రాజకీయ కక్షలకు కేంద్ర బిందువుగా నెల్లూరు నగరంలో 20వ డివిజన్‌ను పేర్కొనవచ్చు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి, రాజీవ్‌గాంధీ భవన్ నేతల మధ్య రాజకీయ విబేధాలు వున్నాయి.

నగరంలోని 20వ డివిజన్‌కు చెందిన అనేక మందిని ఇందిరమ్మ పథకం ద్వారా నిర్మించే పక్కా గృహాలకు ఎంపిక చేయడం జరిగింది. ఎంపిక చేసిన వారికి కొత్తూరు సమీపంలోని వైఎస్ఆర్ నగర్‌లో పక్కా గృహాలు నిర్మించారు. గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో ప్రస్తుతం బలహీనవర్గాల వారికి పక్కా గృహాల రిజిస్ట్రేషన్ కార్యక్రమం జరుగుతుంది. పక్కా గృహాల నిర్మాణానికి అవసరమైన రుణాన్ని బ్యాంకులు మంజూరు చేసేందుకు రిజిస్ట్రేషన్ చేయాల్సి వుంటుంది. ఇందులో భాగంగా ఇప్పటికే నగరంలోని పలు డివిజన్లలో ఎంపికచేసిన ఎస్సీ, ఎస్టీలు మినహా మిగిలిన ఇతర వర్గాల లబ్దిదారులకు రిజిస్ట్రేషన్ కార్యక్రమం పూర్తి చేశారు.

తొలుత ఆనం వర్గంలో వుండి తర్వాత రాజీవ్‌గాంధీ భవన్ ఏర్పాటుచేసి ఆనం వర్గానికి వ్యతిరేకంగా కార్యక్రమాలను నిర్వహించడంలో పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ కీలకపాత్ర పోషించిన సంగతి అందరికీ తెలిసిందే. అనిల్‌కుమార్‌తోపాటు పలువురు మాజీ కార్పొరేటర్లు ప్రస్తుతం వైఎస్.జగన్ వర్గంలో చేరిపోయారు. ఈ క్రమంలో గతవారం నుంచి ఇందిరమ్మ పథకం కింద నిర్మించిన పక్కాగృహాలకు రుణం మంజూరు చేయించాలన్న సంకల్పంతో రిజిస్ట్రేషన్ చేయించాలని గృహ నిర్మాణ శాఖ అధికారులు శ్రీకారం చుట్టారు. అయితే అనిల్‌కుమార్ ప్రాతినిధ్యం వహించే 20వ డివిజన్‌కు చెందిన లబ్దిదారులకు మాత్రం రిజిస్ట్రేషన్ నిలిపివేశారు.

గృహ నిర్మాణ శాఖాధికారులు నిబంధనల ప్రకారం ఎవరి అనుమతి లేకుండానే పక్కా గృహాలను రిజిస్ట్రేషన్ చేయించాల్సి వుంటుంది. రూరల్ ఎమ్మెల్యే రాజకీయంగా ఒత్తిడి చేయడంతో ఏదో ఒక సాకు చూపి రిజిస్ట్రేషన్ చేయకుండా నిలిపివేశారని ఈ డివిజన్‌కు చెందిన

పలువురు లబ్దిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్ఆర్ నగర్‌లో పక్కా గృహాల నిర్మాణం చేపట్టి దాదాపు ఆరు సంవత్సరాలు కావస్తుంది. నిధుల కొరత కారణంగా కొన్ని గృహాల నిర్మాణం పూర్తికాక అసంపూర్తిగానే మిగిలి పోయాయి. వీటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు రుణం మంజూరు కోసం బ్యాంకులు ముందుకొస్తే రాజకీయ ఒత్తిడితో అధికారులు వెనుకంజవేస్తున్నారు.

కేవలం ఆనం వర్గం ఒత్తిడి చేయడంతో రిజిస్ట్రేషన్ కార్యక్రమం జరగలేదని తెలుస్తుంది. ఆనం వర్గం, వైఎస్‌జగన్ వర్గం మధ్య వున్న రాజకీయ విబేధాలను సంక్షేమ కార్యక్రమాల అమలుపై తీర్చుకోవడం ఏమాత్రం సమంజసం కాదు. గృహ నిర్మాణ శాఖాధికారులు కూడా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి లబ్దిదారులకు అన్యాయం చేయడం బాధాకరం.



అమ్మకు నచ్చితే చేస్తా!

ఎదం, మిరపకాయ్, వాంటెడ్ చిత్రాల్లో హీరోయిన్ దీక్షాసేథ్ తెలుగు పరిశ్రమలో తనకు తొందరగా గుర్తింపు రావడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేస్తుంది. ఇద్దరు కథానాయికలు వున్న సినిమాల్లో నటిస్తే ఇమేజ్ తగ్గుతుందనే భయం లేదంటుంది. మనలో సత్తా వుంటే ఏ పాత్రలోనైనా మెప్పించ వచ్చంటుంది. బికినీ వేస్తారా అంటే; మనం ఏది చేసినా దానికో అర్థం వుండాలి. భారతీయ సంప్రదాయాలకు విలువనిచ్చే అమ్మాయిని నేను. విలువలు మరచిపోను. నేను ఏ సినిమా ఒప్పుకొన్నా నాతోపాటు అమ్మ కూడా కథ వింటుంది. అమ్మకి నచ్చితే ఎలాంటి పాత్రలోనైనా నటించడానికి తనకు అభ్యంతరం లేదంటుంది ఈ అమ్మకూచి.

ఎన్నాళ్లు ఇలా అందాలు ఆరబోయాలి? ఒక్కోసారి ఈ ప్రశ్న వేసుకొంటే తనకే చికాగ్గా వుంటుందని బొద్దుగుమ్మ నమిత అంటుంది. బిల్లాలో బికినీ ధరించిన పాత్ర, సింహాలో సింహమంటి చిన్నోడే అంటూ బాలకృష్ణను కవ్వించిన పాత్రలు మరచిపోలేను. అయితే ఇలాంటి పాత్రలు తన సినీ జీవితానికి ఎంతో తోడ్పడ్డాయనీ అయితే నటిగా తనేంటో నిరూపించుకొనే అవకాశాలు మాత్రం రావట్లేదు అని చెబుతోంది. అందుకే నేను రూటు మార్చుకోవాలనుకొంటున్నాను.



ఎన్నాళ్లో ఆరబోత!

కథానాయిక ప్రాధాన్యమున్న చిత్రాలు చేయాలని ఎప్పటి నుంచో ప్రయత్నిస్తున్నాను. ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాలకు, మగువ పోరాటాన్ని చూపే ఘట్టాలకు అవకాశం వున్న కథల కోసం ఎదురు చూస్తున్నానంది.

ప్రయత్నలోపం లేకుండా చూడాలి!



అదృష్టం అంటే ఏమిటో మనకు ఏదైనా గొప్ప మేలు జరిగితే కానీ తెలియదు. మనం ఇతరులకు మంచి చేస్తే దేవుడు మనకు మంచే చేస్తాడు. అంటే అదృష్టం మన చేతుల్లో కూడా కొంతైనా వుందని చెబుతోంది హీరోయిన్ సమంత. నిజం చెప్పాలంటే హీరోయిన్ సమంత అదృష్టవంతురాలు. తమిళంలో సరైన ఆదరణ లభించక తెలుగు పరిశ్రమకు వచ్చిన సమంతకు 'ఏమాయ చేశావె' చిత్రం ప్రాణం పోసింది. తర్వాత ఎన్టీఆర్ సరసన ఆడిపాడి తెలుగు కుర్రాళ్ల మనసుని బృందావనం చేసింది. ప్రస్తుతం మహేష్‌బాబు సరసన నటించే అవకాశం దక్కేసరికి మంచి దూకుడు మీద వుంది. టాలీవుడ్‌లో నిలదొక్కుకొంటున్న ఈమెకు జాతకాల పిచ్చి వుంది. వీటి విషయమై మాట్లాడుతూ అది మన మనసుని బట్టి వుంటుంది. అనుకున్నది జరిగితే అదృష్టం కలిసొచ్చిందంటారు. జరక్కపోతే మన జాతకంలోని లోపాలు వెతుకుతారు. ప్రయత్నలోపం లేకుండా మనపని చేయాలి. తర్వాత అదృష్టాన్ని నమ్ముకుంటే సమస్యలుండవంటుంది.



రీమేక్‌లో పవన్‌కళ్యాణ్

గోకులంలో సీత, సుస్వాగతం, ఖుషి, అన్నవరం, తమ్ముడు ఈ చిత్రాలన్నీ హీరో పవన్‌కళ్యాణ్ నటించినవని రక్కున చెప్పేస్తారు. కాని ఈ చిత్రాలన్నీ రీమేక్‌లు. మరో రీమేక్‌లోనూ నటించను పవన్ కళ్యాణ్ ఒప్పుకొన్నాడు. హిందీ చిత్రం దబాంగ్ ఆధారంగా తెలుగులో తీస్తున్న ఈ చిత్రానికి హరీష్‌శంకర్ దర్శకుడు. ఈ చిత్రాన్ని పవన్ కళ్యాణ్ స్వయంగా నిర్మిస్తున్నాడు.

జయాపజయాలతో బాధే...



నటి త్రిష ఎన్నో ఆశలు పెట్టుకున్న హిందీ చిత్రం 'కట్టామీఠా' తమిళ చిత్రం మన్మధన్ అంబు పరాజయం పాలయ్యాయి. ఇదే విషయాన్ని త్రిషను అడిగితే జయాపజయాలు ఓ నటిగా నన్ను బాధపెడతాయి. అయితే వీటి మూలంగా అవకాశాలు తగ్గిపోతాయి అనుకోవడం భ్రమే. మనలోని టాలెంట్ చూసే అవకాశాలిస్తారు. బాలీవుడ్‌లో నటిస్తున్నప్పుడు అక్కడ చిత్రీకరణ శైలి, అక్కడవారి నటనా శైలులు తెలిశాయి. మన్మధబాణం సినిమా ప్లాప్ అయినా కమల్‌హాసన్ దగ్గర ఎంతో నేర్చుకొన్నానంటుంది తెలివిగా త్రిష.



అందరూ చూడలేని 'జైబోలో తెలంగాణ'

✍ అల్లూరు రహీం

శ్రీరాములయ్య వంటి యదార్థగాధను జనరంజకంగా తెరకెక్కించిన దర్శకుడు ఎన్.శంకర్. ఆయన తెలంగాణ ప్రాంతీయుడు. ప్రత్యేక తెలంగాణ వుద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న నేపథ్యంలో 'నేను సైతం అంటూ' ఆయనే నిర్మాతగా కూడా వ్యవహరించి తీసిన చిత్రమే జైబోలో తెలంగాణ. ఆయన ఈ చిత్రంలో సామాజిక బాధ్యతతో గూడిన తెలంగాణ వుద్యమ నేపథ్యాన్ని ఒక ప్రేమకథకు జత కలిపి తీశాడు. 1948 ప్రాంతంలో బందగీ మొదలుపెట్టిన తెలంగాణ సాయుధ పోరాటం, అక్కడి పల్లెలు, వృత్తి పనుల వారంతా ఏవిధంగా నలిగిపోతున్నది హృద్యంగానే చిత్రీకరించాడు. ఆంధ్రా ప్రాంతీయుల వల్ల తెలంగాణ ప్రాంతీయులకు వుద్యోగాలు లేకుండా పోతున్నాయని, ఇక్కడి నాయకులు తెలంగాణ రాకుండా తెలుగు సినిమా విలన్ల మాదిరి వ్యవహరిస్తున్నారని చిత్రీకరించిన తీరు, అక్కడక్కడ మాటల సరళి సీమాంధ్ర ప్రాంతీయులను బాధపెడతాయి. మనల్ని మనం పరిపాలించుకోవాలి... ఆ గమ్యాన్ని ముద్దాడే వరకు మాకు పోరాటమే శరణ్యమని శంకర్ చిత్రం చివరన సందేశమిచ్చాడు. తెలంగాణను ఆకాంక్షిస్తున్న రాజకీయనాయకులు, కవులు, కళాకారులు, ప్రజాసంఘాల నాయకులంతా ఈ చిత్రంలో నటించారు. కెసిఆర్ అయితే ఈ చిత్రంలో సీమాంధ్ర నాయకులను తిడుతూ గారడి చేస్తుండ్రు అనే పాట వ్రాశాడు. ప్రజా గాయకుడు గద్దర్ అయితే తానే వ్రాసిన పోరు తెలంగాణమా పాటను పాడుతూ వెండితెరపై నర్తించాడు. విమలక్క పాడిన చలో ధూందాం, చిత్రమంతా వినిపించే జైబోలో తెలంగాణ పాటలు బాగున్నాయి. వీటికితోడు ప్రేమికులు పాడుకొనే నిజమేనా, ఒక పువ్వు... నవ్వు పాటలకు చక్రి మంచి సంగీత మందించాడు. ప్రజా కవులు సుద్దాల, గోరేటి వెంకన్న, అందెశ్రీ, నందిని సిద్దారెడ్డి వ్రాసిన పాటలు కాబట్టే ఇవి ఇంతగా ఆకట్టుకొంటున్నాయి. చిత్రంలో గాలనాటి వేణుగోపాల్ పాత్ర ద్వారా ఎమ్పీ లగడపాటి రాజగోపాల్‌ను, ఓ పాట చిత్రీకరణలో మెగాస్టార్ చిరంజీవిని తక్కువ చేసి చూపించాడు శంకర్. అయితే ఈ చిత్రంలో బందగి గోపన్న పాత్రలో ప్రాణం పోసిన నటుడు జగపతిబాబు ఆంధ్రా ప్రాంతీయుడు. తన గళంతో పాటలన్నింటిని వినసొంపు చేసిన వందేమాతరం శ్రీనివాస్ ఒంగోలు వాసి. తెలంగాణ వాదాన్ని సమర్థిస్తున్న కవులు, రచయితలు జూలూరి గౌరీశంకర్, అందెశ్రీ, వేదకుమార్, మల్లేపల్లి లక్ష్మయ్య, దేశపతి శ్రీనివాస్‌లతో పాటు ప్రొఫెసర్లు హరగోపాల్, జయశంకర్, కోదండరామ్‌లు తెరపై తళుక్కుమన్నారు. త్వరలో రానున్న కెసిఆర్ మానస పుత్రిక 'నమస్తే తెలంగాణ' పత్రిక ఎడిటర్ అల్లం నారాయణ చిత్రమంతా కనపడుతూనే వుంటారు. వేణు వ్రాసిన మాటల్లో తెలంగాణలో ఊళ్లన్నీ తాకట్టులో వున్నాయి. నూలుతాడే ఉరితాడు, తెలంగాణ కోసం వందసార్లు కాల్చుకొంటా, ప్రాంతాలుగా విడిపోవాలనుకొంటున్నాం... మనుషులుగా కాదు ఆలోచింపజేస్తాయి.

చిత్ర సమీక్ష

ఇక చిత్ర కథలోనికి వెళ్తే తెలంగాణ కోసం ఎప్పటి నుంచో సాయుధ పోరాటం చేస్తున్న బందగి గోపన్న (జగపతిబాబు) భార్య జయమ్మ (స్మృతి ఇరానీ) ఆయన మరణానంతరం హైదరాబాద్‌కు వచ్చి అమ్మ ఒడి పేరిట ఓ సామాజిక సదనం నిర్వహిస్తుంది. ఇక్కడ తక్కువ ధర అంటే పది రూపాయలకే అన్ని ప్రాంతీయులకు అన్నం పెడుతుంది. ఆమె కుమారుడు వర్షిత్ (సందీప్)కు తండ్రి, తాతలు చేసిన ఉద్యమాలంటే నచ్చవు. విజయవాడ అమ్మాయి సహజ (మీరానందన్)ను ప్రేమిస్తూ ఆమె వెనుక తిరుగుతుంటాడు. ప్రజా కళాకారులు, కవులంతా అమ్మఒడికి తరచూ వస్తుంటారు. ఇంతలో కెసిఆర్ ప్రత్యేక తెలంగాణ కోసం నిరాహారదీక్ష చేస్తాడు. వర్షిత్ మిత్రుడు చారి ఈ ఉద్యమానికి ఊపిరి పోయను ఆత్మాహుతి చేసుకొంటాడు. అప్పుడు వర్షిత్‌లో మార్పువస్తుంది. ఉస్మానియా యూనివర్శిటీలో విద్యార్థి వుద్యమ నాయకుడిగా ఎదుగుతాడు. కేంద్రమంత్రి చిదంబరం ప్రకటన తర్వాత ఎనిమిది గుర్తింపు పొందిన రాజకీయపార్టీల సమావేశం, శ్రీకృష్ణకమిటీ ఏర్పాటు ఈ సమస్యకు పరిష్కారం కాదంటారు. ప్రత్యేక తెలంగాణ యుద్ధానికి విద్యార్థులు పోరుబాటనే సాగాలని నిశ్చయించుకోవడం, చివరన పోరాటవీరుడిగా కెసిఆర్‌ను చూపిస్తూ సినిమా ముగుస్తుంది. ఈ చిత్రానికి బడ్జెట్ ఇంకాస్త పెంచి వుంటే బాగా వచ్చి వుండేదేమో. మొత్తం మీద జైబోలో తెలంగాణ ఆ ప్రాంతీయులను మాత్రం మెప్పిస్తుంది. సీమాంధ్ర ప్రాంతీయులను నొప్పిస్తుందని చెప్పక తప్పదు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌లో అక్రమాలు!

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో పలు అక్రమాలు చోటుచేసుకొంటున్నాయి. అధికారులు ఎన్ని పకడ్బందీ చర్యలు చేపడుతున్నా, విస్తృతంగా తనిఖీలు చేస్తున్నా కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఎత్తులకు పైఎత్తులు వేస్తూ అక్రమాలకు తెరతీస్తూనే వున్నాయి. విద్యార్థుల వద్ద నుంచి భారీగా ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ కొన్ని కళాశాలల్లో తప్ప అధికభాగం కళాశాలల్లో ల్యాబొరేటరీలు లేవు. ప్రయోగశాలలు లేకుండానే సైన్సు విద్యార్థులు ఇంటర్మీడియట్ చదివేస్తున్నారు. పుస్తకాలతో బోధించడం తప్ప ప్రయోగాత్మకంగా వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్న దానిని కళాశాలల యాజమాన్యాలు విస్మరించి ధనార్జనే ధ్యేయంగా కొనసాగుతుండడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు.

చూసీచూడనట్లు బోర్డు అధికారులు

ఇటీవల ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు జరిపిన తనిఖీల్లో అధిక శాతం కళాశాలల్లో ల్యాబొరేటరీలులేని విషయం వెల్లడైంది. ఈ పరిస్థితులలో ఇప్పుడు జరుగుతున్న ప్రాక్టికల్స్ పరీక్షల్లో హడావుడిగా సినిమాల్లో సెట్టింగ్స్ వేసినట్లు తరగతి గదులనే ప్రయోగశాలలుగా మార్చి బెంచీలపైన టెస్టు ట్యూబ్‌లు, రసాయనాలు అమర్చి ల్యాబొరేటరీ వాతావరణాన్ని సృష్టించి తమ తెలివితేటలను ప్రదర్శిస్తున్నారు కొందరు యాజమాన్యాలు. మరోవైపు కార్పొరేట్ కళాశాలలు తమ హవా కొనసాగిస్తున్నాయి. అధికారులు ఎన్నిచర్యలు చేపట్టినా వీటిలో అక్రమాలకు అడ్డుకట్ట పడడం లేదు. కొందరు వేరే కళాశాలలకు వున్న అనుమతులను ఇందుకు వినియోగించుకొంటున్నారు. మరికొందరు విద్యార్థుల వద్ద నుంచి ప్రాక్టికల్స్‌లో మార్కులు కోసమని ప్రత్యేకంగా డబ్బులు వసూలు చేస్తున్నారట. మొత్తం మీద ప్రాక్టికల్స్ పరీక్షలు జిల్లాలో పలు అవకతవకలకు కేంద్రంగా మారాయి.

జనగణనపై తర్జన భర్జన

• గందరగోళంలో సిబ్బంది

జిల్లాలో జరుగుతున్న జనాభా లెక్కల కార్యక్రమంపై అధికారులు తర్జన భర్జన పడుతున్నారు. ఇందులో పాల్గొనే ఉపాధ్యాయులకు ముందుగానే శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. 29 అంశాలతో కూడిన సమాచారాన్ని ఎన్యుమరేటర్లు సేకరించాల్సి వుంటుంది. ఈ నెల 8వ తేది నుంచి నెలాఖరు వరకు జనాభ గణన కార్యక్రమం జరుగుతుంది. గతంలో మాదిరి కాకుండా ఈ దఫా కుటుంబాలకు సంబంధించిన మరికొంత సమాచారాన్ని నిర్ణీత ప్రొఫార్మాలో పొందుపరుస్తున్నారు. సెల్‌ఫోన్స్, కంప్యూటర్, ఇంటర్నెట్, తాగునీటి సౌకర్యాల వివరాలు సేకరిస్తున్నారు. జనగణన నమోదుకు నియమితులైన ఉపాధ్యాయులు పాఠశాల సమయం ముగిసిన తర్వాతనే ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఇటీవల హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. విద్యా సంవత్సరం గడువు సమీపిస్తుండడంతో పాఠ్యాంశాలు పూర్తిగాక విద్యార్థులు ఇబ్బందులుపడే అవకాశం వుందని కొందరు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై హైకోర్టు పైవిధంగా ఆదేశాలిచ్చింది. దీంతో అధికారులు జనగణన సేకరణపై హైకోర్టు ఉత్తర్వులు అమలుచేయక తప్పదు. ఇద్దరు ఉపాధ్యాయులున్న పాఠశాలలో ఒకరు జనగణనకు వెళితే మరొకరు పాఠాలు చెబుతారు. ఒకే ఉపాధ్యాయుడు వున్న చోట మధ్యాహ్నం తర్వాత ఈ కార్యక్రమం చేపడుతున్నారు. ఈ కార్యక్రమంపై అధికారుల్లోగానీ, ఉపాధ్యాయుల్లోగానీ స్పష్టమైన అవగాహన లేకుండా పోయింది.



కార్యక్రమాన్ని నియంత్రించే గణాంక విభాగపు కార్యాలయం.

ఆకట్టుకొంటున్న చేనేత వస్త్ర ప్రదర్శన


ఇందిరాభవన్‌లో చేనేత ప్రదర్శన తిలకిస్తున్న ప్రజలు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరియు చేనేత జౌళిశాఖల ఆధ్వర్యంలో నెల్లూరు ఇందిరాభవన్‌లో చేనేత వస్త్ర ప్రదర్శన ఫిబ్రవరి 1వ తేది ప్రారంభమయ్యింది. ప్రతి దినం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుంది. ప్రఖ్యాతి గాంచిన గద్వాల్, ధర్మవరం, పోచంపల్లి, వెంకటగిరి, బందరు పేట చీరలు, ఉప్పాడ, జమదాని, అంగర, పులగుర్త, మాధవరం పట్టు చీరలు, సీకో, టస్సరు సిల్క్ చీరలు ఆకట్టుకొంటున్నాయి. కాటన్ చీరలు, టై అండ్ డై, గొల్లభామ చీరలు, ధోవతులు, తువాళ్లు, లుంగీలు, మంగళగిరి, చీరాల డ్రస్ మెటీరియల్స్, పెద్దాపురం శిల్క్, పొందూరు కాటన్ షర్టింగ్స్, కరీంనగర్ డిజైన్ బెడ్‌షీట్స్, వరంగల్ డర్రీలు, డోర్ మేట్స్ ఆకట్టుకొంటున్నాయి. తీరిక చేసుకొని నెల్లూరీయులు ఈ వస్త్ర ప్రదర్శనను సందర్శించవచ్చు.

హాస్యనటునిగా ఎదిగిన హరిబాబు

• నెల్లూరు నుంచి అమెరికా వెళ్లి ప్రదర్శనలు


ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్ట్ రవితో కలసి ప్రదర్శననిస్తున్న హరిబాబు.

నవరసాల్లో హాస్యరసానికి ఒక ప్రత్యేకత వుంది. నిత్య జీవితంలో ఎదురయ్యే పలు ఒత్తిడుల నుంచి మనసుకు స్వాంతన కల్గించి గిలిగింతలు పెట్టేది హాస్యం. అలాంటి హాస్యాన్ని పండించడంలో అద్వితీయమైన ప్రతిభ కనబరుస్తూ దేశ, విదేశాలలో పేరు ప్రఖ్యాతులు గడించినవాడు దోర్నాల హరిబాబు. నటనలో తనకంటూ ప్రత్యేకశైలిని ఏర్పరచుకొని సంభాషణల చాతుర్యంతో ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించడంలో నేర్పరి. సింహపురి సీమలో జరిగిన వివిధ కార్యక్రమాల్లో తన నటనను ప్రదర్శించడమేకాక ఖండాంతరాలు దాటి విదేశాలలోనూ శభాష్ అన్పించుకొన్నాడు హరిబాబు.

నెల్లూరుకు చెందిన దోర్నాల నరసింహారావు, సీతారామలక్ష్మమ్మల కుమారుడైన హరిబాబు చదువుకొనే రోజుల నుంచి నటనపై ఆసక్తితో వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ఎన్నో బహుమతులు అందుకొన్నాడు. ప్రముఖ రంగస్థల నటుడు పి.వి. కృష్ణారెడ్డి ద్వారా తొలిసారిగా రంగస్థలానికి పరిచయం అయ్యాడు. ఆ తర్వాత ప్రఖ్యాత రంగస్థల నటుడు పొన్నాల రామసుబ్బారెడ్డి శిక్షణలో ఎన్నో నాటకాల్లో పలు వేషాలువేసి ప్రశంసలందుకొన్నాడు. మనసున మనసై నాటికలో ఉత్తమ ప్రదర్శనకు మద్రాస్ ఆంధ్ర సోషల్ అండ్ కల్చరర్ అసోసియేషన్ నుంచి బంగారు పతకం సాధించాడు. ఈటీవి నిర్వహించిన స్మైల్ రాజా స్మైల్ కార్యక్రమంలో అద్వితీయమైన ప్రతిభ కన్పరచి లక్ష రూపాయల నగదు, స్మైల్ రాజా అవార్డును అందుకొన్నాడు. నవ్వుల్ – నవ్వుల్ కార్యక్రమం ఎంతో పేరు తెచ్చి పెట్టింది. ఆంధ్ర, తమిళనాడు, కర్నాటక, గుజరాత్ రాష్ట్రాలతో పాటు అమెరికా, దుబాయ్, మలేషియాల్లోనూ పలు ప్రదర్శనలు ఇచ్చాడు. కళాకారులకు సామాజిక బాధ్యత వుంటుందని రుజువు చేస్తూ పలు ప్రజాచైతన్య కార్యక్రమాలు, పారిశుద్ధ్యం, విపత్కర పరిస్థితులలో తనవంతు బాధ్యతను నిర్వర్తించడమేకాక రాజకీయంగాను తెలుగుదేశం పార్టీలో 1983 నుంచి క్రియాశీలక పాత్ర పోషిస్తూ సాంస్కృతిక విభాగం ద్వారా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. సింహపురి కీర్తిని దశదిశలా వ్యాపింపజేస్తున్న హరిబాబు అభినందనీయుడు.

ఉపాధిహామీ మొదలై ఆరేళ్లు!

• ఆరంభం నుంచి విమర్శలే!


పథకం మంచిచెడ్డలు చూసే ఇందిరక్రాంతి పథం కార్యాలయం.

నెల్లూరు జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రారంభించి ఆరు సంవత్సరాలైంది. కేంద్ర ప్రభుత్వం 75 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం నిధులతో సంయుక్తంగా ఈ పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. గ్రామీణ ప్రాంత ప్రజల వలసలను నివారించాలన్న లక్ష్యంతోపాటు 100 రోజుల పని దినాలను కల్పించి జీవన ప్రమాణాలను మెరుగు పరచడమే ఈ పథకం ఉద్దేశ్యం. అయితే ఈ పథకం అమలు కోసం నియమించిన సిబ్బంది భారీస్థాయిలో నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా చేపట్టిన సామాజిక తనిఖీల్లో దాదాపు కోటి 50 లక్షల రూపాయలు దుర్వినియోగం అయినట్లు అధికారులు గుర్తించారు. కొన్ని మండలాల్లో కొంత నగదును రికవరీ చేయగా మరికొన్ని మండలాల్లో రాజకీయ ఒత్తిడి కారణంగా రికవరీ చేయలేక పోయారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన సిబ్బంది, ఇతర అధికారులపై చట్టపరమైన చర్యలు లేకపోవడంతో మరికొంత మంది అక్రమాలకు పాల్పడేందుకు అవకాశం కల్పించినట్లైంది. ఈ పథకం అమలుపై గ్రామీణ ప్రాంతాల్లో సరైన విధానాన్ని అవలంభించలేక పోతున్నారు. అధికార పార్టీకి చెందిన నేతలు, సర్పంచ్‌లు ఎలాచెబితే అలా పనులు చేస్తున్నారన్న ఆరోపణలు వున్నాయి. లబ్ధిదారుల ఎంపిక, జాబ్‌కార్డుల జారీ, కూలీలకు నగదు చెల్లింపు తదితర విషయాలను నిబంధనల ప్రకారం పాటించడం లేదు. ఏ పథకానికి కేటాయించని విధంగా ఈ పథకానికీ కోట్ల రూపాయల నిధులు కేంద్రం విడుదల చేస్తుంది.

చరిత్ర హీనుడైనాడు

మొదటి పేజీ కొరవ

వచ్చిన తర్వాత చిరంజీవి తన కుటుంబ సభ్యులతో చెప్పిన వివరాలు బయటకు పొక్కాయి. వాటినిబట్టి, ఆయన తన పార్టీకి 300 కోట్ల రూపాయల విలువ కట్టి, అమ్మాడని తెలుస్తున్నది. ఒకటిన్నర సంవత్సరం పాటురాజకీయాల వల్ల తనకు జరిగిన నష్టాన్ని ఆ మొత్తంగా తేల్చాడట చిరంజీవి. లక్షల కోట్ల స్పెక్ట్రం కుంభకోణాలకు అలవాలమైన ఢిల్లీలో ఇదెంత పెద్ద మొత్తం? ఒక్క క్షణం ఆలోచన చేయకుండా, బేర మాడకుండా సరే అన్నదట సోనియమ్మ. తన జన్మలో ఏ సినిమానూ అంత ధరకు అమ్మలేదన్న సంతోషంతో బయటకు వచ్చి, ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసి పారేస్తున్నట్లు ప్రకటించేశాడు చిరంజీవి.

ఆయనకు, రాజకీయ పార్టీకి సినిమాకు మధ్య తేడా తెలియక పోవచ్చు. కానీ ఆయన ఇచ్చిన సామాజిక న్యాయం అనే నినాదాన్ని నమ్మి, రాజకీయ ఆశలు పెంచుకొన్న లక్షలాది మందికి మాత్రం ఈ పరిణామం అశనిపాతం క్రింద లెక్క. చిరంజీవి మీద చాలామందికి చాలా ఆశలు, వూహలు, అంచనాలు, కోరికలు చెలరేగిన మాట చారిత్రక వాస్తవం. రాష్ట్రంలో రాజ్యాధికారం కేవలం రెడ్డి, కమ్మ కులాలకు మాత్రమే పరిమితమై పోయిందన్న అసంతృప్తి తతిమా కులాల వారిలో చాలా దట్టంగా గూడు కట్టుకొని వుంది. ఆర్థికంగా, సామాజికంగా ఆ రెండు కులాల వారికి ఏ మాత్రం తీసిపోని రీతిలో ఎదుగుదల సాధించిన తమకు రాజ్యాధికారం మాత్రం అందని ద్రాక్ష పండువలె మిగిలిపోతున్న దన్న ఆక్రోశం అలముకొని వుంది. ఆ కల నెరవేర్చుకోవడానికి చిరంజీవి ఒక అవకాశంగా కన్పించాడు. దానికి తగినట్లే ఆయన కూడా సామాజిక న్యాయం అనే నినాదాన్ని పలవరించాడు. దాన్ని నమ్మి లక్షలాది మంది తమ రాజకీయ పోకడలను మార్చుకొని ఆయన పార్టీలో చేరారు. ఎంతోమంది కొత్త వారు కూడా రాజకీయ రంగ ప్రవేశం చేశారు. అభిమానుల సంగతి చెప్పనే అవసరం లేదు. సినిమాలకు పరిమితమై, చిరంజీవి బొమ్మలకు పాలాభిషేకాలు చేసుకోవడంలో తమ జన్మ ధన్యమైనట్లుండిన వారు కాస్తా, రాజకీయ కార్యకర్తలుగా మారిపోయారు. ఇల్లు ఒళ్లు గుల్ల చేసుకొని ఎన్నికలలో పాలుపంచుకొన్నారు. ఇళ్లు అమ్ముకొన్నవారు, ఆస్తులు పోగొట్టుకొన్నవారు, కేసుల్లో ఇరుక్కొన్న వారు, జైలుకు వెళ్లి వచ్చినవారు ఎంతో మంది వున్నారు. ఎన్నికలలో ఓడిపోయిన తర్వాత కూడా వారిలో ఉత్సాహం తగ్గలేదు. కానీ ఇప్పుడు పార్టీయే రద్దయిపోయింది. అగ్ర కులాధిపత్యానికి గండి కొట్టాలనే ఆశకు శాశ్వతంగా తెర పడి పోయింది.

చిరంజీవికి ఇది ఒక సినిమా బొమ్మ అమ్మినంత సులభంగా కనపడుతున్న మాట నిజం. కానీ ఆయన్ను నమ్మినవారికి మాత్రం ఇది తీవ్రమైన గుండె కోత. రాష్ట్రంలో రాజకీయాలను ఒక కొత్త మలుపు తిప్పడానికి, రాజ్యాధికారానికి తరతరాలుగా దూరమై అట్టడుగున పడి వున్నవారిని వెలుగులోకి తేవడానికి, అగ్ర కులాధిపత్యానికి గండి కొట్టడానికి లభించిన ఒక విలువైన చరిత్రాత్మక అవకాశాన్ని చేజేతులా పాడు చేసుకొన్నాడు చిరంజీవి. చరిత్ర హీనుడిగా మిగిలిపోబోతున్నాడు.

కాంగ్రెస్‌కు మాత్రం ఇది ఎంతో సంతోషం కల్గించే పరిణామం. కూలిపోతున్న తమ రాజకీయ సౌధాన్ని నిలబెట్టుకోవడానికి అయాచితంగా లభించిన సువర్ణావకాశం. ఎన్నో రకాల లాభాలున్నాయి వారికి. మొదటిది, కిరణ్ ప్రభుత్వానికి సుస్థిరత ఏర్పడింది. జగన్‌తో వెళ్తున్న ఎమ్మెల్యేల మీద చర్య తీసుకోకుంటే కాంగ్రెస్ పార్టీ జనం దృష్టిలో పలచనై పోతున్నది. అయితే వారి మీద చర్య తీసుకొంటే, ప్రభుత్వం మైనార్టీలో పడిపోతుంది. ఇప్పుడు చిరంజీవి వచ్చి చేరాడు కాబట్టి, జగన్ వెంట వెళ్తామని చెప్పే ఎమ్మెల్యేలందరినీ పార్టీ నుంచి బహిష్కరించినా ప్రభుత్వానికి ప్రమాదం వుండదు.

జగన్‌కు జనం నీరాజనాలు పడుతున్న మాట కాదనలేని సత్యం. అంతటి జనాదరణ, సమ్మోహన శక్తి కల్గిన నాయకుడు రాష్ట్ర కాంగ్రెస్‌లో మరొకడు లేడు. ఇప్పుడు చిరంజీవి ఆ కొరత తీరుస్తాడు. జగన్‌కు పోటీగా ఆయన ఎక్కడ సభ పెట్టినా, ఏ మాత్రం లోపం లేకుండా జనం వస్తారు.

రేపటి ఎన్నికలలో కాంగ్రెస్ ఓట్లకు జగన్ గండి కొట్టడం ఖాయం. ఆ లోటు పూడ్చుకోవడం కాంగ్రెస్‌కు అసాధ్యం. చిరంజీవి వూరూరు తిరిగి ప్రచారం చేస్తే ఆయన కులం ఓట్లు, అభిమానుల ఓట్లు నియోజకవర్గానికి కనీసం పదివేల లెక్కనైనా కాంగ్రెస్‌కు కలిసి వస్తాయి. మొన్నటి ఎన్నికలలో ప్రజారాజ్యానికి రాష్ట్రం మొత్తం మీద 75లక్షల ఓట్లు వచ్చాయి. రేపటి ఎన్నికలలో అందులో పాతిక భాగం కలిసి వచ్చినా కాంగ్రెస్‌కు లాభమే.

తనతో కాంగ్రెస్ ఇన్ని విధాల లాభపడేప్పుడు, తనకూ అందుకు తగిన ప్రయోజనం వచ్చేట్లు చూసుకోవడం ఏ రాజకీయవాది అయినా చేసే పని. కానీ సోనియాగాంధీ ఇచ్చిందని చెప్తున్న 300 కోట్ల రూపాయలు లెక్క పెట్టుకోవడంలో తలమునకలై పోయిన చిరంజీవి, ఈ పరిణామం వల్ల తనకు రాజకీయంగా కూడా లాభం చేకూరే అవకాశం వుందని, తనను నమ్ముకొన్న వారికి ఎంతో కొంత న్యాయం చేసే అవకాశం వుందని మర్చిపోయాడు. ఉన్నపళాన తన పార్టీ మొత్తాన్ని కాంగ్రెస్‌లో విలీనం చేస్తే, ఈ రోజు వరకు తన కోసం వీధులలో జెండా పట్టుకొని తిరిగినవారు అనాధలౌతారన్న ఇంకిత జ్ఞానం కూడా లేకుండా ప్రవర్తించాడు. నియోజక వర్గ స్థాయిలో ప్రజారాజ్యం కార్యకర్తలు, నాయకులు కూడా ఇక అనాధల క్రిందే లెక్క. కాంగ్రెస్‌లో పాతుక పోయిన స్థానిక నేతల క్రింద బానిసల వలె మెలగక తప్పని పరిస్థితి. లేదంటే, రాజకీయాలు వదలి ఇళ్లకు పోవాలి. వేరే గత్యంతరం లేదు.

కాంగ్రెస్‌లో విలీనం కంటే, పొత్తు ఒప్పందం చేసుకొని వుంటే అటు కాంగ్రెస్‌కు, ఇటు ప్రజారాజ్యం కూడా సమాన లాభం పొంది వుండేవి. ఢిల్లీ ప్రభుత్వంలోనే సంకీర్ణ రాజకీయాలు నడిచే రోజులలో అదేమంత అభ్యంతరం చెప్పదగిన విషయం కాదు. దానివల్ల ప్రజారాజ్యం అస్థిత్వం నిలిచి వుండేది. దాన్ని నమ్ముకొన్న వారు అట్లనే కొనసాగేవారు. కాంగ్రెస్‌కు ప్రభుత్వం నిలిచేది. ఎన్నికలలో లాభమూ వచ్చేది. ఉభయ పార్టీల కార్యకర్తలు కలిసి పని చేసేవారు. పదవులు పంచుకొనేవారు. విలీనం వల్ల ఆ అవకాశాన్ని కోల్పోయింది ప్రజారాజ్యం.

అంత తెలివి తక్కువగా విలీనానికి ఒప్పుకోవడానికి కారణం – ఈ రాజకీయ బరువును ఎంత త్వరగా దించుకొందామా అని చిరంజీవి పడిన తాపత్రయం. ఒక పార్టీ నడపాలంటే, ఎంతో కొంత సమయం కేటాయించాలి. వచ్చిన వారితో మాట్లాడాలి. ప్రజా సమస్యలపై స్పందన చూపాలి. ఉద్యమాలు చేయాలి. అంత ఓపిక చిరంజీవికి లేదు. రాజకీయం ఒక లంపటం వలె కన్పడింది ఆయనకు. నెత్తి మీద మోయలేని బరువుగా తోచింది. ఒక్క దెబ్బతో దాన్ని దించుకొన్నాడు.

నెల్లూరు ముచ్చట్లు

3వ పేజీ కొరవ

ఏర్పాటు చేస్తున్నామన్నారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి వెంకటేశ్వర్లు కూడా అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నట్లు చెప్పారు.

ఉచిత హోమియో వైద్యం

నెల్లూరు పోలీసు కాలనీలోని జిల్లా వెలమ సంఘం కార్యాలయంలో ప్రతి ఆదివారం ఉదయం 7.30 నుంచి 10.30 గంటల వరకు ప్రముఖ హోమియో వైద్యులు డాక్టర్ పి.విద్యాసాగర్ రోగులను పరీక్షించి ఉచితంగా ముందులు ఇస్తారు. ఈ సదవకాశాన్ని ప్రజలను వినియోగించుకోమంటున్నది వెలమ సంఘం కార్యవర్గం.

ఇక మిగిలేదెవరు?

16వ పేజీ కొరవ

సురేఖ ఎగిరిపోతే రాజకీయంగా కోలుకోవడం చాలా కష్టం. దానితో సురేఖ మీద తీవ్రస్థాయి ఒత్తిడి తెస్తున్నాడు జగన్. నీ రాజకీయ భవిష్యత్తుకు నాదీ పూచీ అని హామీ ఇస్తున్నాడు. వరంగల్‌లో గెలవలేవని

పిచ్చోళ్లై పోతున్నారేమిటి?

16వ పేజీ కొరవ

లకు సంబంధించిన ఇంటికి మునిసిపల్ సిబ్బందిని పంపి, అనుమతి లేకుండా కట్టారనే నెపంతో కారు షెడ్ కూలదోయించాడు వివేకానందరెడ్డి. ఆ ఫైనాన్స్ వ్యాపారి చేసిన నేరం గోవర్ధన్‌రెడ్డితో ఫోన్లో మాట్లాడడం అట. రాపూరు టౌన్‌లో ఒక బ్రాందీ షాపు మీద ఇట్లానే తమ ప్రతాపం ప్రదర్శించారు. అది నేదురుమల్లి రాజ్యలక్ష్మి నియోజకవర్గం కాబట్టి, ఆ వ్యాపారి ఆమె రక్షణ కోరడంతో నేరుగా ముఖ్యమంత్రి వద్దకు వెళ్లి ఫిర్యాదు చేశాడట రామనారాయణ రెడ్డి. ఆ ముఖ్యమంత్రి కూడా వేరే పనేమీ లేనట్లుంది. ఎక్సైజ్ అధికారులకు ఫోన్‌చేసి ఆ అంగడి మూత వేయించాడు.

నెల్లూరు నగరంలో ఎవరు తమను ధిక్కరించినా, మునిసిపల్ సిబ్బందిని, పోలీసులను పంపి వారి ఇళ్లు కూలగొట్టించడం ఒక అలవాటుగా మారింది వివేకానందరెడ్డికి. రియల్‌ఎస్టేట్ వ్యాపారులైతే ఆయన దెబ్బకు హడలి పోతున్నారు. లే అవుట్‌లను నిలువునా నాశనం చేస్తున్నాడు. మరొక ప్రక్క అధికారులను బండ బూతులు తిట్టడం ఒక ఫ్యాషన్‌గా మారింది. ఒక్కొక్కరిని పిలిచి, నోటికొచ్చినట్లు తిట్టి, మీకు ఇష్టం లేకుంటే సెలవు పెట్టి వెళ్లిపొమ్మని

డిఎస్పీలకు కేబుల్ టివి ప్రసారాల నియంత్రణ!

ఇక నుంచి కేబుల్ టివిల ద్వారా ప్రసారమవుతున్న కార్యక్రమాలను నియంత్రించే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం డిఎస్పీలకు అప్పగించింది. కేంద్ర సమాచార ప్రసారాల శాఖ నిర్వహించిన సమావేశంలో కేబుల్ టివి ప్రసారాలపై నిఘా పెట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరడంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని డివిజన్ కేంద్రాలలో పనిచేసే డిఎస్పీలకు అధికారాలను కట్టబెడుతూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కేబుల్ టివిల్లో ప్రసారమయ్యే కార్యక్రమాలపై నిఘా వుంచి ఎప్పటికప్పుడు నివేదికను రూపొందించి, నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకొనే అవకాశం వుంది.

పిస్తే పులివెందుల నుంచి నిలబెట్టి గెలిపిస్తానని నచ్చచెప్తున్నాడు. పాత జ్ఞాపకాలు, వైఎస్ చేసిన ఉపకారాలు జ్ఞప్తికి తెస్తున్నాడు. దానితో ఎటు పోవాలో అర్థంకాక, ఎటూ నిర్ణయించుకోలేక అయోమయంలో పడిపోయి వుంది కొండా సురేఖ ఇప్పుడు. ఆమె జారుకొంటే మాత్రం జగన్ పార్టీ భవిష్యత్తు అనుమానమే.

బెదిరిస్తున్నాడు రామానారాయణరెడ్డి. అధికార మదం తన అన్నకంటే అధికంగా పట్టి వుంది ఆయనకు.

జిల్లా పరిషత్ చైర్మన్‌ను రాజకీయంగా, ఆర్థికంగా దెబ్బతీయడానికి ఆనం సోదరులు చేసే ప్రతి ప్రయత్నమూ ఆయన ప్రతిష్టను మరింత పెంచుతున్నాయే తప్ప తగ్గించడం లేదు. జిల్లా పరిషత్‌లో పనిచేసే వేలాది మంది ఉపాధ్యాయులు మంత్రిగారి దాష్టీకాన్ని కూడా ధిక్కరించి, తమకు నష్టం జరుగుతుందన్న భయం వదలిపెట్టి మరీ కాకాణి గోవర్ధన్‌రెడ్డి వద్దకు వచ్చి సంఘీభావం తెల్పుతున్నారు. జిల్లా పరిషత్ పాఠశాలలకు, విద్యార్థులకు గత నాలుగున్నరేళ్లుగా గోవర్ధన్‌రెడ్డి చేసిన ఉపకారాలు, స్వంత డబ్బు ఖర్చుపెట్టి మరీ చేసిన పనులు, అవినీతి రహితంగా చేసిన పాలన ఆయన పట్ల అంత ఆకర్షణ పెంచాయి. నిద్రలేస్తే ఎక్కడ ఏమి దొరుకుతుందా దోచుకొని తినడానికి ఒక ప్రక్క తన ఇష్ట సఖులకు సంతృప్తి పరచడానికి మునిసిపాలిటీ మొత్తాన్ని తాకట్టు పెట్టే నీచ వైఖరి మరొక ప్రక్క అలవాటు చేసుకొన్న ఆనం సోదరుల వంటి రాజకీయ భ్రష్టులు గోవర్ధన్‌రెడ్డి వంటి సజ్జనులను ఏమి చేయగలరు? వారి పాపానికి వారే అంతమై పోవడం తప్ప ఈ ఆనం మార్కు రౌడీ రాజకీయం వల్ల ఎవరికి జరిగే నష్టం ఏమీ వుండదు.

జనవాణి

2వ పేజీ కొరవ

కోవూరుకు ఆర్టీసి బస్సులు నడపండి!

ఒకప్పుడు కోవూరుకు లెక్కలేనన్ని టౌన్ బస్సులు నడిచేవి. గిట్టుబాటు కావడం లేదని బస్సులు ఆగిపోయాయి. మూడంటే మూడు టౌన్ బస్సులు నడుస్తున్నాయి. ఇవి అందుబాటులో లేక పోవడం వల్ల ప్రజలు ఆటోల్లో ఎక్కి నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసి వున్నతాధికారులు కోవూరుకు కొన్ని ఆర్టీసి బస్సులు నడపాల్సిన అవసరం ఎంతైనా వుంది.

టి.కోటేశ్వరరావు, కోవూరు

నాయకులు వేషాలు మానాలి

రాజకీయ నాయకులు రకరకాల వేషాలేస్తున్నారు. వీటిలో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో డ్యాన్సులు వేస్తున్నారు. దేవాలయం, మసీదు, చర్చ్‌లకు వెళ్లినప్పుడు అక్కడ అవసరమైనవి వాడేస్తున్నారు. వాస్తవానికి మసీదు దర్గాలోనికి వెళ్లాలంటే విధిగా తల స్నానం చేయాలి. టోపి పెట్టుకోను నియమనిబంధలున్నాయి. ఈ విషయాలను ముస్లిం సోదరులు పట్టించుకోవడం లేదు. దేవాలయాల్లో, చర్చ్‌లలో ప్రవేశానికి ఎన్నో నియమనిబంధనలు వున్నాయి. కాని నేతలు తమ వేషాల్లో భాగంగా వీటిని ఆచరించక మతవిశ్వాసాలను దెబ్బతీయడం మంచిది కాదు.

ప్రొఫెసర్ నాగరాజరావు, హైదరాబాదు

క్లస్టర్ల ఏర్పాటుతో ప్రయోజనం చేకూరేనా?

జనాభా ప్రాతిపదికన మూడు నుంచి నాలుగు గ్రామ పంచాయితీలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసేందుకు నివేదికలు తయారు చేస్తున్నారు. గ్రామ పంచాయితీలను క్లస్టర్‌గా ఏర్పాటుచేస్తే కార్యదర్శుల కొరత తీరడంతోపాటు ప్రజలకు పాలనా సౌలభ్యం ఏర్పడుతుందని ప్రభుత్వం ఆలోచిస్తుంది.

రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా సౌలభ్యం కోసం గ్రామ పంచాయితీలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను క్లస్టర్లగా ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టింది. క్లస్టర్ల ఏర్పాటుకు సంబంధించి వైద్య, ఆరోగ్యశాఖ, పంచాయితీరాజ్ శాఖలు ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశాయి. దీంతో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఉప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కలిపే దిశలో నిమగ్నమై వుంది. ఉప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో విధులు నిర్వహించే సిబ్బందిలో కొంతమంది క్లస్టర్‌గా ఏర్పాటుచేసే కేంద్రాలలో విధులు నిర్వహించాల్సి వుంటుంది.

జిల్లా వ్యాప్తంగా వున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సక్రమంగా పని చేయడం లేదన్న విమర్శలు వున్నాయి. గ్రామీణ ప్రాంత ప్రజలకు సరైన వైద్య సేవలు అందించడంలో ఈ కేంద్రాల వైద్యులు, సిబ్బంది పూర్తిగా వైఫల్యం చెందుతున్నారు. ఈ క్రమంలో కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సైతం ఇతర పిహెచ్‌సిలలో విలీనం చేస్తారు. 75వేల నుంచి లక్షా 50 వేల జనాభాను కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేస్తున్నారు. ఇక నుంచి 30 పడకల ఆసుపత్రి కూడా నూతనంగా ఏర్పాటు చేసే క్లస్టర్ పరిధిలోకి వస్తుంది. ఐదు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కలిసి ఒక క్లస్టర్‌గా వుంటుంది.

పంచాయితీల పరిస్థితి

వైద్య, ఆరోగ్యశాఖ బాటలోనే గ్రామ పంచాయితీలను సైతం క్లస్టర్లగా ఏర్పాటు చేస్తారు. మొత్తం జిల్లాలో 961 గ్రామ పంచాయితీలున్నాయి. ఈ పంచాయితీలలో కొన్నింటికి పూర్తి బాధ్యతలు నిర్వర్తించే కార్యదర్శుల నియామకం జరగలేదు. ఇన్‌ఛార్జీల పాలనలో గ్రామ పంచాయితీలు ఇప్పటివరకు నెట్టుకొస్తున్నాయి. జనాభా ప్రాతిపదికను ఆధారం చేసుకొని మూడు నుంచి నాలుగు గ్రామ పంచాయితీలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసేందుకు నివేదికలు తయారు చేస్తున్నారు. గ్రామ పంచాయితీలను క్లస్టర్‌గా ఏర్పాటు చేస్తే కార్యదర్శుల కొరత తీరడంతోపాటు ప్రజలకు పరిపాలనా సౌలభ్యం వుంటుందన్నది ప్రభుత్వ ఆలోచన.

అయితే గ్రామ పంచాయితీలను క్లస్టర్లగా ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంపై పలువురు సర్పంచ్‌లు, కార్యదర్శులు అనేక సందేహాలను వ్యక్తం చేస్తున్నారు. రెండు, మూడు గ్రామ పంచాయితీలను కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటుచేస్తే ఇతర పంచాయితీలకు చెందిన ప్రజలు ప్రతి పనికి క్లస్టర్‌గా వున్న గ్రామ పంచాయితీ కార్యాలయానికి వెళ్లాల్సి వుంటుంది. ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లడం వలన ప్రజలకు కొన్ని ఇబ్బందులు తలెత్తే అవకాశం లేకపోలేదని వారు వ్యాఖ్యానిస్తున్నారు. త్వరలో గ్రామ పంచాయితీల కాలవ్యవధి ముగియనున్న తరుణంలో రాష్ట్రప్రభుత్వం క్లస్టర్ల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

మూడు గ్రామ పంచాయితీలకు ఒకే కార్యదర్శిని నియమించి ప్రభుత్వం చేతులు దులుపుకొనేందుకే వీటిని ఏర్పాటు చేస్తుందని విమర్శిస్తున్నారు. జిల్లా పంచాయితీ అధికారి కూడా క్లస్టర్ల ఏర్పాటుపై కసరత్తు ప్రారంభించారు. గ్రామ పంచాయితీలలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణ లోపభూయిష్టంగా వుంటుంది. ఈ క్రమంలో క్లస్టర్ల ఏర్పాటు జరిగితే మరిన్ని సమస్యలు ఏర్పడే అవకాశం వుంది. ఈ నెల 12వ తేది రాష్ట్ర ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి జిల్లా పర్యటనకు వస్తే వైద్య, ఆరోగ్యశాఖ, గ్రామపంచాయితీల క్లస్టర్లను ప్రారంభించాలని అధికార యంత్రాంగం భావిస్తుంది.

రామ్‌మనోహర్ లోహియా జీవిత సంగ్రహం!

దేశస్వాతంత్ర్యం కోసం, అణగారిన ప్రజాసంక్షేమం కోసం తన చివరి క్షణం వరకూ పోరాడిన అపూర్వమైన వ్యక్తి డాక్టర్ రామ్‌మనోహర్ లోహియా. భారతదేశం గర్వించదగ్గ మేధావుల్లో లోహియా ఒకరు. తన సోషలిస్టు ఆలోచనా ధృక్పథంతో దేశంలో ఒక తరం యువకుల్నే ప్రభావితం చేసిన లోహియా 23 మార్చి 1910లో జన్మించారు. ఆయన శత జయంతి ఉత్సవాలలో భాగంగా లోహియా శత జయంతి సమితి ప్రచురించిన "రామ్‌మనోహర్ లోహియా ఆలోచన - అభిప్రాయాలు అనే పుస్తకం ఈ తరానికి లోహియా తత్వాన్ని సంక్షిప్తంగా పరిచయం చేయడంతో సఫలమయ్యింది. ఇందులో లోహియాలోని విభిన్న కోణాలను ఆవిష్కరించే పది వ్యాసాలున్నాయి. అవి కూడా మధులిమాయే, ఎన్.జి.రంగా, నార్ల వెంకటేశ్వర రావు, జస్టిస్ పి.ఏ.చౌదరి, ఇళాదత్, సంజీవ దేవ్ వంటి మేధావులు వ్రాసినవి కావడం విశేషం. అంతే కాకుండా లోహియా మరణించిన తర్వాత జాగృతి, ఆంధ్రజ్యోతి పత్రికల్లో ఆయనపై వెలువడిన సంపాదకీయాలు కూడా వ్యాసాలతోపాటు చేర్చారు. లోహియా పరిచయ వ్యాసం వివరణాత్మకంగా ఉంది. ఆయా వ్యాసకర్తలు లోహియాలోని బహుముఖ విలక్షణ వ్యక్తిత్వాన్ని సమర్థవంతంగా రచించారు. అమెరికా పౌరహక్కుల ఉద్యమంలో లోహియా పోషించిన పాత్రను ఇళాదత్ క్షుప్తంగా వివరించినది అపురూపమైన వ్యాసం. లోహియా తత్వంపై మాజీ స్పీకర్ రబిరే వ్యాసం మనల్ని ఆలోచింపజేస్తుంది. 'చిరంజీవి లోహియా' అనే వ్యాసంలో తుమ్మల చౌదరి లోహియా రాజకీయ ప్రస్థానాన్ని చదివించే విధంగా విదేశీకరించాడు. నిజానికి ఈ పుస్తకంలో అన్ని వ్యాసాలూ లోహియా కృషిని, జీవిత విలువల్ని సమర్థవంతంగా విశ్లేషించాయి. ఒక విప్లవకారుడిగా, రాజకీయవేత్తగా, పార్లమెంటేరియన్‌గా, నిస్వార్థ నాయకుడిగా లోహియా జీవితంలోని వివిధ అంశాలను సంక్షిప్తంగా ఈ వ్యాసాలు పాఠకులకందిస్తాయి. లోహియా జీవితంలో అనేక ఆసక్తికర సంఘటనలను, అయన వ్యంగ్య సంభాషణలను, నేటి ప్రభుత్వంపై అతని సునిశిత విమర్శలను ఈ పుస్తకంలో చేర్చి వుంటే బావుండేది. లోహియాను పరిచయం చేసుకోవాలనుకొనే నేటి తరం పాఠకులకు ఈ పుస్తకం చక్కగా ఉపయోగపడుతుంది. ఇందులోని వ్యాసాలను లోహియాతో ప్రత్యక్ష పరిచయం వున్న రావెల సోమయ్య సంకలనం చేశారు. కొన్ని ఆంగ్ల వ్యాసాలకు లోహియా శత జయంతి కమిటీ అనువాదం చేసింది.

డాక్టర్ రామ్‌మనోహర్ లోహియా
ఆలోచనలు - అభిప్రాయాలు

సంకలనం : **రావెల సోమయ్య**
సమీక్షకుడు : **ధనిశెట్టి లెనిన్**
పేజీలు : **95**, వెల : **20**రూ.

ప్రతులకు

రావెల సోమయ్య
101 - గోదానిలయం, 555,
మయూరి మార్గ్, బేగంపేట,
హైదరాబాద్-16.

ప్రారంభ దశలో గుర్తిస్తే...

తెగుళ్ల నుంచి పంటను రక్షించుకోవచ్చు!

జిల్లాలో సాగు చేసివున్న వరి, వేరుశనగ పంటలకు ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కారణంగా పలురకాల తెగుళ్లు సోకే అవకాశం వుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్తున్నారు. దీనిని గుర్తించి రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏరువాక (డాట్ సెంటర్) శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.రవీంద్రకుమార్, కె.పుల్లంరాజు సూచిస్తున్నారు. ప్రధానంగా వరిలో పండు తెగులు, వేరుశనగలో మొవ్వకుళ్లు తెగులు వ్యాపించే అవకాశాలు అధికం అన్నారు. తెగుళ్ల లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తించి, సస్యరక్షణలు చేపట్టడం ద్వారా పంటను కాపాడుకోవచ్చని సలహాలిస్తున్నారు.

వరి పంటకు పండు తెగులు వెన్నుదశలోనే ఆశిస్తుందన్నారు. ఈ దశలో గాలిలో తేమ శాతం ఎక్కువగా వుండడం వల్ల ఈ పండు తెగులొవస్తుందని దీనినే మానికాయ తెగులు అంటారన్నారు. వాతావరణంలో మార్పుల ప్రభావం, ముఖ్యంగా మంచు అధికంగా పడుతున్నందువల్ల ఈ తెగులు అధికంగా పంటలను ఆశించే అవకాశం వుందన్నారు. ఈ తెగులు సోకినపుడు అండాశయం ఆకు పచ్చరంగు నుంచి పసుపు రంగులోకి మారి చివరకు నల్లబడుతుందన్నారు. ఈ మానికాయ తెగులు నివారణకు పైరు వెన్ను దశలో వున్నప్పుడే ప్రొపిజెనకోల్ ఒక మిల్లీలీటరు, కార్బండిజమ్ ఒక గ్రాము లీటరు నీటిలో కలిపి వెన్నుపైకి వచ్చే దశలో ఒకసారి, వారం విడిచి మరోసారి పిచికారీ చేయాలన్నారు. దీనివలన తెగుళ్ల బాధల నుంచి పంటలను కాపాడుకోవచ్చన్నారు.

వేరు శనగ పంటకు సంబంధించి మొవ్వకుళ్లు తెగులు తామర పురుగుల ద్వారా వ్యాపిస్తుందన్నారు. ఈ తెగులును ప్రారంభదశలో గుర్తించలేమని, వ్యాధి ముదిరే కొద్ది తెగులు లక్షణాలు బయటపడతాయన్నారు. ఆకులపై గుండ్రని మచ్చలు లేదా చారలు ఏర్పడుతాయని తద్వారా మొవ్వ చనిపోతుందన్నారు. ఈ తెగులు వేరుశనగ, పెసర, మినుము, అలసంద పైర్లను ఆశిస్తుంది. ఈ తెగులు నివారణకు లీటరు నీటికి మోనోక్రోటో ఫాస్ 1.6 మిల్లీ లీటర్లు లేదా అసిఫేట్ 1.5 గ్రాములు చొప్పున కలిపి పిచికారీ చేయాలి.



స్కూల్ కిట్స్ పంపిణీ చేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి.

వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వితరణ

నెల్లూరులో నిశ్శబ్దంగా సంఘ సేవా కార్యక్రమాలు చేస్తుండే పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నగరంలోని మునిసిపల్ స్కూళ్లలో ఒకటవ తరగతి చదివే 600 మంది పిల్లలకు 5వ తేది స్కూల్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ కిట్స్‌లో విద్యార్థులకు ఉపయోగపడే 18 రకాల వస్తువులున్నాయి. యూనిఫాం, టవల్, దుప్పటి, పరుపు, పలక ఇత్యాదులన్నీ కలిపితే ఒక్కో కిట్ విలువ 2500 రూపాయలు. స్లీపింగ్ చిల్డ్రన్స్ ఆల్‌రౌండ్ ది వరల్డ్(స్కా) కార్యక్రమంలో భాగంగా రోటరీ క్లబ్ ఆఫ్ అంబత్తూరు చెన్నై నేతృత్వంలో ఇందులో కార్యనిర్వాహకునిగా వున్న ప్రభాకర్‌రెడ్డి తన చేతులమీదుగా ఈ కార్యక్రమం చేశారు. అంగ వైకల్యం, బుద్ధి మాంద్యం, పేదరికంలో వున్న పిల్లలకు సాయంచేసి మంచి భవిష్యత్తు కల్పించేందుకు నెల్లూరులో 2009లో 400 మందికి, 2010లో 650 మంది విద్యార్థులకు ఈ కిట్‌లను అందజేసినట్లు ప్రభాకర్‌రెడ్డి ఈ సందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు సాయిభాస్కర్‌రెడ్డి, బి.వి. నరసింహం, హజరత్‌బాబు, అంబత్తూర్ రోటరీ క్లబ్ అధ్యక్షులు పార్థసారధి, హెడన్ హర్రీన్ తదితరులు పాల్గొన్నారు.

Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/09-11

అన్నదమ్ములింత పిచ్చోళ్లై పోతున్నారేమిటి?

- జిప చైర్మన్ మీద అలివిమాలిన కక్ష.
- ఆట బొమ్మలై పోతున్న అధికారులు.
- వీళ్లు తరిమే కొద్దీ ఆయన ప్రతిష్ట పెరుగుతోంది.
- తమను ధిక్కరిస్తే ఇల్లు కూల్చివేత.
- మాట కాదంటే బ్రాందీ షాపు మూత.
- ఊతపదాలౌతున్న బండ బూతులు.
- జిల్లాలో ఆనం మార్కు ఆటవిక రాజ్యం.

అవధులు లేని అధికారం, అలివిమాలిన అవినీతికి దారి తీస్తున్నది. అది కూడా అదుపు తప్పితే ఎక్కడలేని అహంకారం ఆవహిస్తున్నది. ఆ దశ కూడా మదపిచ్చి మనిషిని వివసుడిని చేస్తున్నది. జిల్లా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రూరల్ ఎమ్మెల్యే రంలో చేరాడు. పోతూ పోతూ తన వెంట సగం కాంగ్రెస్ పార్టీని తీసుక వెళ్లాడు. చెప్పుకోదగిన సంఖ్యలో జడ్పీటీసి సభ్యులు, మండల అధ్యక్షులు, ఎమ్పీటీసిలు, సర్పంచ్‌లు, మునిసిపల్ కార్పొరేటర్లు, ఇతరత్రా నాయకులు ఆయన వెంట పార్టీని వీడారు. అది ఆనం వారికి



నిర్మాణంలో వున్న జడ్పీ కార్యాలయంలో ఏసిబి తనిఖీలను ప్రశ్నిస్తున్న జడ్పీ వైస్‌ఛైర్మన్ రాజా, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి.

ఆనం వివేకానందరెడ్డి ఇప్పుడీ అవస్థ లోనే వున్నారు. వారికి పిచ్చి పూర్తిగా ప్రకోపించినట్లుంది. తామేమి చేస్తున్నదీ వారికి ఎంత మాత్రం అర్థం కావడం లేదు. తమ చర్యలు ఎంత వికారంగా మారుతున్నదీ తెలుసుకోలేక పోతున్నారు. తమ మాట శాసనంగా అమలు చేసుకోవాలన్న దురహంకారంతో కన్నుమిన్ను కానరాకుండా ప్రవర్తిస్తున్నారు. రాజకీయ ప్రత్యర్థులను శత్రువులుగా చూస్తున్నారు. రాయలసీమ రౌడీ రాజకీయాన్ని నెల్లూరుకు దిగుమతి చేయచూస్తున్నారు. గత వారం రోజులుగా జిల్లా పరిషత్ కార్యాలయ భవన నిర్మాణ స్థలంలో నడుస్తున్న దౌర్జన్యాలను చూస్తే అన్నదమ్ములింత పిచ్చివాళ్లై పోతున్నారేమిటా అని ఆశ్చర్యం కల్గుతున్నది.

టిబి ఆస్పత్రి ఆవరణలో కొత్తగా జిల్లా పరిషత్ భవనం కడుతున్నారు. 90 శాతం కట్టడం పూర్తి అయిపోయింది. చిల్లర మల్లర పనులు మిగిలి వున్నాయి. ఈ దశలో జిల్లా పరిషత్ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి కాంగ్రెస్‌ను వీడి జగన్ శిబి ఆగ్రహం తెప్పించింది. ఏనుగంత బలం వున్నవారమని తాము విర్రవీగుతుంటే, ఈ ఛైర్మన్ తమను పీనుగులుగా మార్చి తమతో వున్నవారిని కూడా తీసుకొని వెళ్లిపోవడం వారికి కడుపు మండించింది. ఎట్లైనా కక్ష తీర్చుకోవాలనుకొన్నారు. కానీ కాకాణి గోవర్ధన్‌రెడ్డి తమ వలె అవినీతి పరుడు కాదు. తమ వలె దురహంకారి కాదు. తమ వలె దౌర్జన్య పరుడు కాదు. తమ వలె జనం చేత ఛీ కొట్టించుకునే వాడు కాదు. ఏ తప్పూ లేకుండా ఆయన్ను సాధించేది ఎట్లా? ఆ అక్కసులో ఆనం సోదరుల కళ్లు జిల్లా పరిషత్ భవనం మీద పడ్డాయి.

ఆ భవనం కట్టడం పూర్తైతే ప్రారంభోత్సవ శిలాఫలకం మీద కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేరు కూడా వ్రాయక తప్పదు. ఛైర్మన్‌గా ఆయనకు ఇంకా ఐదు నెలల పదవీ కాలం వుంది. అప్పటివరకు భవన నిర్మాణం నిలిపి వేయాలని దాని కాంట్రాక్టర్‌ను ఆదేశించాడు రామనారాయణరెడ్డి. ఆర్థిక మంత్రి మాట కాదని ఏ కాంట్రాక్టర్ బ్రతికి బట్ట కట్టకలడు? దానితో ఆ కాంట్రాక్టర్ రాత్రికి రాత్రి అక్కడ నుంచి మాయమై పోయాడు.

అంతకంటే మొండి మనిషి గోవర్ధన్‌రెడ్డి. కాంట్రాక్టర్‌ను భయపెట్టి తరిమివేసినంత మాత్రాన మీ ఆటలు సాగనిస్తానా అని రంగంలోకి దిగాడు. తానే మనుషులను పెట్టి కొరవా సరవా పనులు పూర్తి చేయడం మొదలు పెట్టాడు. అది ఆనం సోదరుల అహంకారం మీద గట్టి దెబ్బ తీసింది. పోలీస్‌ను పంపి, అక్కడ పనిచేస్తున్న కూలీలను అరెస్ట్ చేయించాడు. నగరంలో జగన్ వర్గానికి నాయకత్వం వహిస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లడాయి పెట్టుకొన్నాడు. ఈ గొడవ ముదిరితే లేనిపోని చిక్కులొస్తాయని పోలీస్‌లు ఆ కూలీలను వదలివేశారు. దానితో మంత్రి గారు సంబంధిత ఇంజనీర్లను పిలిచి బండ బూతులు తిట్టి, పనులు ఆపించమన్నారు. వారు జిల్లా పరిషత్ ఛైర్మన్‌ను ప్రాధేయపడ్డారు పనులు ఆపమని. ఆయనందుకు అంగీకరించలేదు. మరొక ప్రక్క మంత్రి, ఎమ్మెల్యే కలిసి జిల్లా అధికారుల మీద ఒత్తిడితెచ్చి, మరొకసారి కేసు పెట్టించారు. కానీ దానివల్ల పని జరగలేదు. వారిద్దరికీ కోపం నషాలానికి అంటింది. ఎసిబి డిఎస్‌పిని బెదిరించి, ఒత్తిడి తెచ్చి ఆ భవనం పని జరిగే చోట దాడులు చేయించారు. గోవర్ధన్‌రెడ్డికి పాలనాపరంగా సంబంధం వున్న సైదాపురం, పొదలకూరు మండలాలలో, జిల్లా పరిషత్ ఆఫీస్‌లో కూడా ఎసిబి దాడులు జరిగాయి. అయినాసరే, కాకాణి గోవర్ధన్‌రెడ్డి లెక్క చేయలేదు, పనులు ఆపలేదు. ఏమి చేయాలో తోచక జుట్టు పీక్కొంటున్నారు అన్నదమ్ములిప్పుడు

మరొక వారం లోపల పనులు పూర్తి చేయించి, భవనం ప్రారంభించాలన్నది గోవర్ధన్‌రెడ్డి ఆలోచన. దాన్ని ఆనం సోదరులు ఎట్లా అడ్డుకొంటారో వేచి చూడాలి.



వివాదాస్పదంగా మారిన జడ్పీ ఆఫీసు భవన నిర్మాణం.

ఇదిట్లా వుంటే, గోవర్ధన్‌రెడ్డి సంబంధీకులందరి మీద తమ దౌర్జన్యాన్ని ప్రదర్శిస్తున్నారు. నెల్లూరు నగరంలో ఆనం వారికి అనాదిగా అనుచరులుగా వున్న ఒక ఫైనాన్స్ కంపెనీ కుటుంబీకు

కొరవ 14వ పేజీలో

సురేఖ తప్పుకొంటే


ఇక మిగిలేదెవరు?



తమ పంజరం నుంచి కొండా సురేఖ ఎగిరి పోబోతుందన్న వార్త జగన్ శిబిరాన్ని తీవ్రమైన సంక్షోభానికి గురి చేస్తున్నది. ఎవరూ వూహించని పరిణామం ఇది. జగన్ కోసం తన ప్రాణం ఇవ్వడానికి కూడా సిద్ధమని ప్రకటించిన వీరనారి సురేఖ. ముఖ్యమంత్రి స్థానంలో వైఎస్‌ను లేదా జగన్‌ను తప్ప రోశయ్య వంటి వారి ముఖం చూడడానికి కూడా తనకు మనస్కరించడం లేదని చెప్పి, పదవికి రాజీనామా విసిరికొట్టిన పరమ భక్తురాలు. ఆ తర్వాత కూడా జగన్ శిబిరంలో కీలక స్థానం ఆమెదే. జగన్ తరపున ఎవరిని తిట్టాలన్నా ఒక్క క్షణం ఆలోచన చేయలేదు. అటువంటి వీర విధేయురాలు ఒక్కసారిగా పద్ధతి మార్చుకొన్నారు. తెలంగాణకు వ్యతిరేకంగా లోక్‌సభలో నినదించిన జగన్ పట్ల తెలంగాణలో వ్యక్తమవుతున్న వ్యతిరేకత ఆమెను పునరాలోచనలో పడవేసింది. ఆయన్ను నమ్ముకొంటే తెలంగాణలో తనకు రాజకీయ సమాధే అన్న భయం ఆవరించింది. మరొక ప్రక్క వరంగల్ జిల్లా నుంచి కొత్తగా మంత్రి అయిన సారయ్య ఆమె కుటుంబం మీద ఉక్కు పాదం మోపుతున్నాడు. ఎన్నో కేసులు, ఎందరో శత్రువులు వున్న సురేఖ కుటుంబానికి పోలీస్ అండ లేకుంటే ప్రాణం అరచేతిలోకి వచ్చేస్తుంది. పోలీస్ రక్షణ లేకుండా ఇంటి నుంచి బయటకు రాలేని భయస్తురాలామె. వారి బలహీనతను ఆసరాగా తీసుకొని బసవరాజు సారయ్య, పొన్నాల లక్ష్మయ్య ఒక ఆట ఆడిస్తున్నారు. ఇది అనుకూలతగా మలచుకొని తమ శత్రువులు తమ ప్రాణాలకు ముప్పు తెస్తారన్న భయం ఆవహించింది. మరొకప్రక్క తెలంగాణలో మరీ ముఖ్యంగా ఉద్యమం పునాదులు బలంగా వున్న వరంగల్ జిల్లాలో జగన్‌ను నమ్ముకొంటే రాజకీయసమాధి తప్పదన్న అంచనా బలపడింది. వీటన్నింటితో ఆమె జగన్ శిబిరం వదలాలని నిర్ణయించుకొన్నారు. పిసిసి అధ్యక్షుడు డి.శ్రీనివాస్ శరణు చొచ్చిందామె.

అయితే తమ వర్గం నుంచి కొండా సురేఖ పక్కకు తప్పుకొంటే, దాని ప్రభావం తతిమా ఎమ్మెల్యేల మీద ఎంత తీవ్రంగా వుంటుందో జగన్‌కు తెలుసు. ఇప్పటికే ఉండవల్లి అరుణ్‌కుమార్ వంటి వైఎస్ భక్తుడు తనకు వ్యతిరేకం కావడం జగన్‌ను బాగా ఇబ్బంది పెడుతున్నది.

కొరవ 14వ పేజీలో



Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.